ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ఏప్రిల్ 27, 2008

ENTERED
కథా నిలయం శ్రీకాకుళం
ENTERED

భారతీయ చలనచిత్ర ఆదిగురువు ఫాల్కే!

హ్యాపీ బర్త్ డే

(2008 ఏప్రిల్-27 నుంచి
2008 మే -3 వరకు)

బి. వరప్రసాద్
1సం॥, ఏప్రిల్-27
విజయలక్ష్మి-శ్రీనివాస్
పొందూరు-శ్రీకాకుళం

పి. కృష్ణవేణి
3సం॥, ఏప్రిల్-28
రేణుక-రామకృష్ణ
ముదిగొండ-ఖమ్మం

సిహెచ్. శ్రీరమణి
ఏప్రిల్-29
విజయ-అజయ్
తూరంగి-కాకినాడ

విద్యాసాగర్
3సం॥, ఏప్రిల్-29
పద్మ-వెంకటేష్
ఉండ్యాల-మ॥నగర్

రాజేశ్వరి
ఏప్రిల్-29
క్రాంతి-వెంకటేష్
మంగళగిరి-గుంటూరు

ఆర్.అనఘం
7సం॥, ఏప్రిల్-30
సుధ-రఘురాం
చందానగర్-హైదరాబాద్

సిహెచ్. నాగశ్రీ
10సం॥, మే-3
సైదమ్మ-వెంకటనర్సయ్య
టేకులపల్లి-ఖమ్మం

పి. కళ్యాణ్‌నాయుడు
2సం॥, మే-1
సాయిమల్లిక-రాజేష్
కృష్ణలంక-విజయవాడ

జి. వీనీల
8సం॥, మే-3
వరలక్ష్మి-ప్రకాష్
మిర్యాలగూడ-నల్లగొండ

ఎం. మానస
1సం॥, ఏప్రిల్-2007
సైదులు-నీలిమ
రాఘవాపురం-నల్లగొండ

కె. నరేష్
ఏప్రిల్-28
సాయిలక్ష్మి-వాసుదేవ్
గుడుమాల్-మ॥నగర్

శ్రీనివాస్‌చారి
5సం॥, ఏప్రిల్-2003
సుజాత-బాషయ్యచారి
ముట్రాజ్‌పల్లి-మెదక్

ఎం. సాయితేజ
6సం॥, ఏప్రిల్-2002
సుజాత-శ్రీనివాసులు
రాజనగరం-మ॥నగర్

ఆకాశ్
1సం॥, ఏప్రిల్-2007
మాధవి-వెంకటయ్య
అమరచింత-మ॥నగర్

కె. సాయికుమార్-స్వాతి
8సం॥, ఏప్రిల్-2000
ధనలక్ష్మి-మధు
అరకాలవీధి-విజయనగరం

వి. సాయి సుశ్వేత
శ్రీలక్ష్మి-నాగభూషణం
పెద్దాపురం-తూ॥గో

బి. అంకిత
1సం॥, ఏప్రిల్-2007
సునీత-రాజు
గోపాల్‌పేట-మ॥నగర్

ENTERED
కథా నిలయం
శ్రీకాకుళం



పోరాడితేనే మార్పు వస్తుంది

మన అతిథి

పేరు	:	మూకిరి జాన్‌మాణిక్యరావు
ఊరు	:	కొమ్మూరు, గుంటూరు జిల్లా
తల్లిదండ్రులు	:	నీలమ్మ, రత్నం
చదువు	:	ఎం.ఎ. మ్యాథమేటిక్స్, ఆంధ్రా యూనివర్సిటీ
పుట్టిన తేదీ	:	23.05.1926
వృత్తి	:	లెక్చరర్, శాసనమండలి సభ్యునిగా 1974 నుండి 1985 వరకు రెండు పర్యాయాలు పనిచేశారు.
నచ్చిన వ్యక్తులు	:	కారల్‌మార్క్స్, లెనిన్, స్టాలిన్, పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, లావు బాలగంగాధరరావు, ఎం.హెచ్.
నచ్చిన రచనలు	:	క్యాపిటల్, సుందరయ్యచరిత్ర
ప్రవృత్తి	:	బోధన, రచన (ఉపాధ్యాయ సమస్యలపై అనేక వ్యాసాలు రాశారు)
అవార్డులు	:	విద్యారంగం నుండి అనేక సన్మానాలు, పత్రాలు పొందారు
మర్చిపోలేని సంఘటన	:	పెళ్లి. (3.1.1952లో మనోనిరంజనమ్మతో కుల, మతాంతర వివాహమైంది. లావు బాలగంగాధరరావు ఆయన భార్య సరోజిని, సుహాసిని, సులోచన, డాక్టర్ ఆర్.రాఘవరావు, మాదాల నారాయణస్వామి వివాహం జరిపించారు.) మాది కులాంతర, మతాంతర వివాహం. నేను క్రిస్టియన్ హరిజన, నా భార్య తెలగ. నా భార్య తల్లిదండ్రులు, అమ్మమ్మ మా పెళ్లికి అంగీకరించలేదు. ముఖ్యంగా అమ్మమ్మ చంపడానికి కూడా వెనుకాడదని భయపడి పారిపోయి వచ్చింది. లావు బాలగంగాధరరావు, ఆయన భార్య సరోజిని, వారి చెల్లెళ్లు మా వివాహం జరిపించారు.

ఇప్పుడు మనం భూస్వామ్య పెట్టుబడిదారీ దోపిడీ సమాజంలో జీవిస్తున్నాం. ఇది అత్యంత సంక్షుభిత స్థితిలో వుంది. పేద రైతులు, శ్రామికులపై దారుణమైన దోపిడీ సాగిపోతున్నది. మరోవైపున ఆధునీకరణ పేరుతో మధ్య తరగతి వుద్యోగులు కూడా వంచించబడుతున్నారు. వీరందరూ సమీకృతులై కదలి పోరాడితేనే పరిస్థితిలో మార్పు వస్తుంది. మార్క్సిజానికి, మానవతావాదానికి నిబద్ధులైన వారు మాత్రమే ఈ కర్తవ్యం నిర్వహించగలుగుతారు. పోరాటాలు ఉద్యమాల ద్వారానే ఈ లక్ష్యం నెరవేరుతుంది. అందుకే కమ్యూనిస్టులు, ప్రగతిశీల శక్తులు కలసి కట్టుగా ముందుకొచ్చి పీడితుల విముక్తికోసం ఈ పోరాటం చేపట్టాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. మధ్య తరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమైక్యంగా సహకరించాలని కూడా కోరుకుంటున్నాను. ఆ విధంగా పీడిత ప్రజలూ మధ్య తరగతి బుద్ధిజీవులూ ఏకమై నవ సమాజం కోసం పోరాడగలరని విశ్వసిస్తున్నాను.

M. J. MANIKYARAO

ఈ సంచికలో....

టపా ... 2
ఆరోగ్యం ... 3
సీరియల్ ... 8
సినిమా ... 10
మనసా... తెలుసా ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
సమ్‌థింగ్ స్పెషల్ ... 17

ఇంకా...

మంచిపుస్తకం ...6
ఓట్ల గణాంకాలు
సీట్ల పురాణాలు





చూద్దామా ... 4
మంచు బంగారు లోకం ఊటీ

విజ్ఞాన వీచిక ... 20
నవ్వుల్ పువ్వుల్ ... 21
సలహాలు ... 22
రుచి ... 23
కొత్త పుస్తకాలు ... 24

కథ ... 18
కాగితం పువ్వు

ఎన్నో విషయాలు తెలిశాయి

13వ తేదీ ఏప్రిల్ ఆదివారం సంచికలో అట్టమీది కథ ద్వారా రైలుకు సంబంధించిన విషయాలెన్నో తెలుసుకున్నాం. ఆవిరితో నడిచే ఇంజన్ నుండి విద్యుత్ ఇంజన్ల వరకూ ... చెక్క పట్టాల నుండి ఇనుప పట్టాల వరకూ రైలు నిర్మాణంలో జరిగిన ప్రగతిని గురించి తెలుసుకున్నాం. చిన్న తనం నుండీ రైలు ప్రయాణం అంటే ఇష్టపడే నేను ఈ వ్యాసాన్ని చదివి తెలీని ఎన్నో విషయాలను తెలుసుకున్నాను. భారతదేశపు అభివృద్ధికి రైళ్ళు ఒక కారణమే అవడం అద్భుతం. అలాగే "చూద్దామా"... శీర్షికలో డార్జిలింగ్ ఒక పర్యాటక స్థలంగా బ్రిటీష్ వారిచే అభివృద్ధి చెందిన విశేషాలన్నీ, దర్శనీయ స్థలాలను గురించీ ఎన్నో విషయాలను తెలుసుకున్నాం. ముఖ్యంగా వేసవిలో వచ్చే వివిధ మూత్ర సమస్యలను గురించీ... రాకుండా తీసుకోవలసిన జాగ్రత్త గురించీ... వచ్చినప్పుడు తీసుకోవాల్సిన వైద్య చికిత్సలను గురించీ 'ఆరోగ్యం' శీర్షికలో చర్చించడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. డాక్టర్ గారికి ధన్యవాదాలు.

గొల్లమండల సురేష్‌కుమార్,
సీతారాంపురం, ఖమ్మం.

మురిపించిన డార్జిలింగ్

ఏప్రిల్ 13, 2008 నాటి సంచికలో రైలు బండి విశేషాలు, విభిన్న ఇంజన్ల వివరాలు చదివి చాలా సంగతులు తెలుసుకున్నాం. 'పద్నాలుగేళ్ల పాప' విషయాలన్నీ అబ్బురపరిచే విధంగా ఉన్నాయి. 'ఆరోగ్యం' శీర్షిక ద్వారా వేసవిలో తరచుగా వచ్చే మూత్ర సమస్యలకు సంబంధించి డాక్టర్ చంద్రమోహన్ గారి వివరణ వల్ల అనేక విషయాలు అర్థమయ్యాయి. వేసవిలో అందరం రెండు లీటర్లకు తక్కువ కాకుండా 'నీళ్ళు' తాగాలని తెలుసుకున్నాం. ఇంకా 'ఓ మంచి పుస్తకం' బావుంది. విజ్ఞాన వీచిక ద్వారా 2008ని కప్పల సంవత్సరంగా ప్రకటించారని గ్రహించాము. యాజీవ్ అందించిన 'చూద్దామాలో' హిల్‌స్టేషన్లలోనే డార్లింగ్‌గా భాసిల్లుతున్న డార్జిలింగ్ ప్రాంత సంగతులు మురిపించాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పని చేయాలన్న ఈ వారం మన అతిథి మహెజబీన్ జీవితాశయం నెరవేరాలని ఆకాంక్షిస్తూ...

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం టౌన్.

గొప్ప అనుభూతి

నేను తొలిసారిగా ఊహ తెలిశాక మా ఇంటిల్లిపాది కలిసి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పాత పట్నం అమ్మవారి దర్శనానికి రైల్లో వెళ్ళాము. ఆ రోజుల్లో బొగ్గు రైళ్లు వుండేవి. ఆ రైలు బండి ప్రయాణం ఇప్పటికి అప్పుడప్పుడు గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఇప్పటికి నీలగిరి పర్వత ప్రాంత రైల్వే డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే ప్రాంతంలో పొగరైలు బళ్ళు ఉన్నాయని ఈ వారం 'బండిరా పొగ బండిరా చుక్ చుక్ బండి!' అట్టమీది కథ చదివి తెలుసుకున్నాం. ఆనందపరవశం చెందాం. మళ్ళీ జీవితంలో ఒక్కసారి ఆ రైళ్లలో ప్రయాణం చెయ్యాలన్న అనుభూతికి లోనయ్యాం. పూర్వం, మన సినిమా కవులు రైలు బండిపై పాటలు రచించారు. వాటికి సంగీతదర్శకులు మధురమైన సంగీతాన్ని సమకూర్చారు. ఇక దృశ్య చిత్రీకరణ నభూతో నభవిష్యత్ అని చెప్పక తప్పదు. 'పదుచుదనం రైలు బండి పోతూ వుంది. ఆహా పోతూ వుంది' వంటి పాటలు ఇప్పటికి ఎన్నో కోట్ల తెలుగు ప్రేక్షకుల గుండెల్లో మెదులుతూ ఉంటాయి. ఇక రైలు పెట్టెల్లో చిత్రీకరించిన పాటలు మధురాతి మధురం! 'ఈ మౌనం ఈ బిడియం ఇదేనా ఇదేనా చెలియ కానుక" వంటి పాటలు గుర్తుకు వస్తే చాలు ఎంతో ఉల్లాసం, ఉత్సాహం పొంగుతుంది! తెలుగు చలన చిత్ర సీమలో రైలు బండికి ఎంతో ప్రాముఖ్యత నిచ్చే సినిమాలు ఇంకా వస్తూనే వున్నాయి. సర్కార్ ఎక్స్‌ప్రెస్ సిన్మా ఆ రోజు గొప్ప సూపర్ హిట్. ఈ వారం రైళ్ళ గురించి స్పందింప చేసినందుకు మీకు కృతజ్ఞతలు.

జె.సుధాకర్ పట్నాయక్,
కాకినాడ.

తెలియని విషయాలు తెలిపింది

ఏప్రిల్ 13 నాటి సంచికలో స్నేహ ముస్తాబై మా ముందుకు చుక్ చుక్ మంటూ వచ్చింది. తెలియని ఎన్నో విషయాలను తెచ్చింది. తీపి జ్ఞాపకాలు పంచింది. బండిరా... పొగ బండిరా అంటూ వెళ్ళింది. రైలు లేని ప్రపంచాన్ని ఊహించడం నిజంగానే కష్టం. అసలు రైలు లేని కాలంలోనే పట్టాలు ఉండేవంటూ ఆనాటి సంగతులను తెలిపారు. మొదట చెక్కబద్దీలు, ఆపై ఇనుప బద్దీల గురించి తెలియజేస్తూ ప్రతి ఒక్క శాస్త్ర వేత్త దానిపై చేసిన కృషిని చదువుతుంటే నిజంగా ఆశ్చర్యపోయాం. మన రైల్వే ప్రస్థానం అంటూ భారతదేశ అభివృద్ధిని మా కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. 'స్టీఫెన్‌సన్' ఫొటో చూసి ఆశ్చర్యపడ్డాం. 1955 తరువాత ప్రపంచ వ్యాప్తంగా వేగానికీ, సామర్థ్యానికి ప్రాముఖ్యం పెరిగి రూపు రేఖలు మారిపోయాయంటూ ఆవిరి ఇంజన్ల గురించీ బొగ్గు ఇంజన్ల గురించి చాలా చక్కగా వివరించారు. ఒకే పట్టాపై నడిచే మోనో రైళ్ళు, డ్రైవర్లు లేని రైళ్ళు, బులెట్ ట్రైన్లూ.... ఆవిరి ఇంజన్‌కి ఒక జ్ఞాపకంగా మార్చే ప్రయత్నం చేశారు. ఈ కంప్యూటర్ రంగం లోనూ మాకు తెలియని ఎన్నో విజ్ఞానదాయకమైన విషయాలలను మా చేతికందించిన స్నేహకు వందనాలు.

కర్రా వరప్రసాద్,
యలమర్రు కండ్రిక.

జోక్స్ అదుర్స్

రైలు ప్రయాణం మన జీవితాల్లో మరిచిపోలేని సంఘటనలు జరుగుతుంటాయి. రైలు ఎక్కిన ప్పుడు నుంచి, దిగేవరకు ఎన్నో వింతలు, విడ్డూరాలు చూస్తుంటాము. మాకు తెలియనివి కొన్ని విషయాలు తెలుసుకున్నాం. జీవితం లాంటి ఈ రైలు బళ్లలో తెల్లవారు జాము నుండి రాత్రి వరకు చేసి ప్రయాణంలో రకరకాల మనుష్యలను చూస్తుంటాం. ఎందరో పరిచయమవుతుంటారు. రకరకాల రైళ్ల గురించి తెలియచేసిన కాకర్ల మూడి



విజయ్‌గారికి అభినందనలు. సీరియల్, జోక్స్, కథలు చాలా బాగుంటున్నాయి. ఈవారం 'సాయం' కథ బాగుంది.

కోసూరి గోపాలకృష్ణ,
అరకాలవీధి, విజయనగరం.

డార్జిలింగ్ చూడాల్సిందే

ఆదివారం స్నేహ 13.4.08 నాటి పత్రికలో అతిథిగా వచ్చిన మా నెల్లూరు ఆడపడచు మహెజబీన్‌కు అభినందనలు. నిజాయితీ, నిరాడంబరత, స్త్రీలు, బాలలపై మక్కువ ఉండడం శ్లాఘనీయం. ప్రకృతి రమణీయతకు ఆలవాలమైన డార్జిలింగ్ వీలున్న వారు చూడాల్సిన ప్రదేశం. 155 సంవత్సరాల చుక్, చుక్ అవసరం నేటికి ఎంతో వుంది. బంగాళదుంపల బజ్జి భేషుగ్గా ఉంటుంది. ఆవకాయ పసందు అవనిలో మరెక్కడా ఉండదు. 'బుల్లి సెలబ్రిటీ' కథ బాగుంది.

వాస్తు రామచంద్ర,
రాంజీ నగర్, నెల్లూరు.

సరదా సరదా...

ఈవారం సమ్‌థింగ్ స్పెషల్‌లో ప్రచురించిన 'సరదా సరదా సమ్మర్ క్యాంప్‌లు' చదివిన తర్వాత పిల్లలందరు తమ బంధువుల ఇళ్ళకు ఇష్టమైన ప్రదేశాలకు వెళ్లి సంతోషంగా గడుపుతారు. ముఖ్యంగా చిన్నారులకు సెలవులంటే మరీ ఇష్టం. పిల్లల్లో ఏదో ఒక టాలెంట్ ఉంటుంది. పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ సహకరించాలి. సెలవుల్లో పిల్లలకు ఆటపాటలు ముఖ్యంగా సంగీతం, పాటలు పాడటం, క్యారమ్స్, చెస్, బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇస్తుండాలి.

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్‌నగర్ కాలనీ,
విజయనగరం.

డాక్టర్ ఎంజి జయన్,
కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
మెడిసిటి హాస్పిటల్స్, హైదరాబాద్.
ఫోన్ 9885907426

" వేసవిలో జీర్ణాశయానికి సంబంధించి రెండు రకాల సమస్యలు వస్తాయి. అవి డయేరియా, వైరల్ హెపటైటిస్. డయేరియాతో నీళ్ల విరేచనాలొస్తాయి. ఇవి రెండూ కలుషిత, అపరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల కలుగుతాయి. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వీటిని నివారించొచ్చు.... అవేంటో తెలుసుకుందామా.... "

అపరిశుభ్రమైన ఆహారంతో అన్నీ సమస్యలే!

రోజూ రెండుసార్లు మలవిసర్జనకు వెళ్లడం సాధారణం. అలాకాక రోజూ మూడుసార్ల కన్నా ఎక్కువగా నీళ్ల విరేచనాలు అవుతుంటే డయేరియాగా భావించాలి. జ్వరం, కడుపులో నొప్పి, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంత మంది రోజూ మూడుసార్ల కన్నా ఎక్కువ మలవిసర్జనకు వెళ్తారు. అంతమాత్రాన వారికి డయేరియా వచ్చినట్లు కాదు. కలుషితమైన, అపరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకున్నప్పుడు బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. ఈ బ్యాక్టీరియా చిన్న పేగుల్లోకి వెళ్లి అక్కడున్న మ్యూకోజ్ పొరను దెబ్బతీస్తుంది. దీంతో అక్కడ పుళ్లు ఏర్పడి, పొర లీకవుతుంది. దీంతో నియంత్రణ కోల్పోయి నీళ్ల విరేచనాలొస్తాయి.

విరేచనాలు అవుతుంటే ఏం చేయాలి?

రోజూ పది సార్లు విరేచనాలవుతుంటే శరీరం నుంచి నీళ్లతోపాటు, ఉప్పు, లవణాలు అధికంగా బయటికెళ్తాయి. దీంతో నీరసంగా ఉంటుంది. వీటిని ఎలక్ట్రొలైట్స్ ద్వారా భర్తీ చేయాలి. దీన్నే ఎలక్ట్రొలైట్ థెరపీ అంటారు. అలా చేయకుండా వారం రోజులకు పైబడి అశ్రద్ధ చేసే వారిలో మూత్రపిండాలు దెబ్బతింటాయి. శరీరంలో వృధా ద్రవాలను శుద్ధి చేసి వ్యర్థాలను మూత్రం ద్వార పంపించడం మూత్రపిండాల విధి. మనం తీసుకునే నీరు తగ్గినప్పుడు మూత్ర విసర్జనను తగ్గిస్తాయి. నీళ్ల విరేచనాలైనప్పుడు శరీరంలోని నీళ్లు ఎక్కువగా బయటికి వెళ్తాయి. దీంతో రక్తపోటు తగ్గుతుంది. ఫలితంగా మూత్రపిండాలకు సరఫరా అయ్యే రక్తం శాతమూ తగ్గుతుంది. మూత్రపిండాల్లోని నెఫ్రాను దెబ్బతింటాయి. మూత్ర విసర్జన తగ్గుతుంది. నీళ్ల విరేచనాలే కదా అని డాక్టర్‌ను సంప్రదించకుండా, ఎలక్ట్రొలైట్ థెరపీ చేసుకోకుండా యాంటి బయాటిక్స్ (సిప్రొఫ్లాక్సిన్, మెట్రనెడిజోల్) తీసుకుంటే కొన్ని సార్లు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశముంది.

నిర్ధారణ

సాధారణంగా రోగి లక్షణాలను బట్టి డయేరియా అని డాక్టర్ చెప్పగలుగుతారు. అందరికీ అన్ని పరీక్షలు చేయరు. అవసర మైనప్పుడే రక్త పరీక్ష, మల పరీక్ష చేసి డయేరియాను నిర్ధారిస్తారు.

చికిత్స

రోగి లక్షణాలు, పరిస్థితిని బట్టి చికిత్స ఉంటుంది. వైరల్ ఇన్‌ఫెక్షన్లు వాటంతట అవే ఆగిపోతాయి. బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ వల్ల తీవ్రమైన జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటారు. వీరు ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. ఐవి ఫ్లూయిడ్స్, గ్లూకోజ్‌తో చికిత్స చేస్తారు.

వైరల్ హెపటైటిస్

వేసవిలో, వర్షాకాలంలో వైరల్ హెపటైటిస్ (హెపటైటిస్-ఎ,ఇ) వస్తుంది. వేసవిలో నీళ్లు కలుషితం అవ్వడం వల్ల ఇదెక్కువగా వస్తుంది. బాగా ఎండలున్నప్పుడు ఒకటి రెండుసార్లు బాగా వర్షాలు పడతాయి. దీంతో నీళ్లు కలుషితమవుతాయి.

లక్షణాలు : నీరసంగా ఉండడం, ఆకలి కాకపోవడం, వాంతులు, కొద్దిగా కడుపునొప్పి... లక్షణాలు కనిపిస్తాయి. 15 రోజుల తర్వాత కళ్లు పచ్చగా మారి కామెర్లు వస్తాయి.

చికిత్స : రక్తపరీక్ష, ఐజిఎం, లివర్ ఫంక్షన్ టెస్ట్ ద్వారా నిర్ధారిస్తారు. వీటికి సపోర్టివ్ చికిత్స చేస్తే వెంటనే తగ్గుతాయి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మూఢనమ్మకాల వల్ల ఆకు పసర్లు తాగడంతో రోగి పరిస్థితి విషమిస్తుంది. దగ్గర్లోని డాక్టర్‌ను సంప్రదించాలి. కొన్ని రకాల వైరల్ హెపటైటిస్‌లు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల అవంతటవే పోతాయి.

ఆ జాగ్రత్తలు ఏంటంటే...

వేసవిలో శుభ్రమైన నీరు తాగడం మంచిది. 10 నిమిషాలు మరిగించి, చల్లార్చిన నీళ్లు తాగడం వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియాలు శరీరంలోకి చేరవు. ❖ తీసుకునే ఆహారం వేడిగా ఉండాలి. దీని వల్ల ఇందులో ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లు చనిపోతాయి. ❖ వృత్తి, అవసరాల రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు మినరల్ బాటిల్ నీళ్లు తాగితే మంచిది. ❖ శుభ్రమైన పరిసరాల్లో ఆహారం తీసుకోవాలి. రోడ్డుపై అమ్మే టిఫిన్లు, తినుబండరాలు, ఛాట్ మసాలాలు తీసుకోకపోవడం మంచిది. ❖ డయేరియా వచ్చినప్పుడు ఇంటి వైద్యం చాలా వరకు ఉపశమనం కలిగిస్తుంది. గ్లాసు నీళ్లలో రెండు చెంచాల చక్కెర, చిటికెడు ఉప్పు వేసి తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. దీంతోపాటు కొబ్బరి నీళ్లు తాగితే మంచిది. మార్కెట్లో వివిధ రకాల ఎలక్ట్రొలైట్స్ దొరుకుతాయి. వీటిలో ఏవైనా వాడొచ్చు. ❖ ఒక సారి నీళ్ల విరేచనమైతే ఒక గ్లాసు మరగించి చల్లార్చిన నీటిలో ఎలక్ట్రొలైట్స్ కలిపి తాగించాలి. ❖ డయేరియా వచ్చినప్పుడు పాల కన్నా మజ్జిగ, పెరుగు తీసుకోవాలి. పాలు తీసుకోవడం వల్ల జీర్ణం కాక విరేచనాలు పెరిగే అవకాశముంది. వీటితోపాటు గంజి, సగ్గుబియ్యం కూడా తీసుకోవచ్చు. ఇలా వీటితో రెండు రోజులు ప్రయత్నించినా నయమవకపోతే డాక్టర్‌ను సంప్రదించాలి. ❖ రోజూ 10 నుంచి 15 సార్లు నీళ్ల విరేచనాలు, నీరసం, చమటలు పట్టడం, తల తిరగడం, మూత్రం తక్కువ రాడం కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ❖ చిన్న పిల్లల్లో, వృద్ధుల్లో ఈ సమస్య ప్రారంభమైన వెంటనే చికిత్స చేయించుకోవాలి.

ఆదిమూలం శేఖర్


తేయాకు తోట

మంచు బంగారు లోకం ఊటీ

మండు వేసవి... మిట్టమధ్యాహ్నం... సమయం రెండు గంటలు...నడిరోడ్డు మీద స్వెట్టర్ వేసుకుని నిలబడితే...ఎలా వుంటుంది? ఇదేం ప్రశ్న...వేసవిలో అదీ, మధ్యాహ్నం స్వెట్టర్ వేసుకోవడం ఏంటి.... తమాషానా...అనుకుంటున్నారు కదూ... ఈ వాతావరణ పరిస్థితుల్లో నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పడం కూడా కష్టమే....కాళ్లూ నెత్తి కాలిపోతుంటాయ్. ఉక్కపోతతో ఒళ్లంతా చమట్లు నదిలా ప్రవహిస్తుంటాయి. స్వెట్టర్ వేసుకుంటే ఇక అంతే...కానీ మండు వేసవి అయినా, మిట్టమధ్యాహ్నం అయినా....అక్కడ స్వెట్టర్ వేసుకోవాల్సిందే. లేకుంటే చలిపులి చంపేస్తుంది.

అదే ప్రకృతి అందాల హరివిల్లు... ఊటీ.

ఉదక మండలం, నీలగిరికొండలు అని కూడా పిలవబడే ఊటీలోకి అడుగుపెట్టగానే మనసంతా ఉల్లాసంతో నిండిపోతుంది. ఎటు చూసినా కొండలు లోయలు, జలపాతాలు, వాలుకొండలపై విశాలంగా, పచ్చగా, పేర్చినట్లు పరచుకున్న తేయాకు తోటలు కనువిందు చేస్తుంటే...మెల్లగా కురిసే మంచు, ఉన్న ఫళంగా భారీ వర్షం కురిసేస్తుందనిపించే చల్ల చల్లని వాతావరణం...మనసును గిలిగింతలు పెడతాయి. కోటి ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఊటీలో సందర్శనీయ స్థలాలు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తే, ఊటీకి రైలు ప్రయాణం మరపురాని అనుభూతిని మిగుల్చుతుంది.

తమిళనాడు, కర్నాటక, కేరళ మూడు రాష్ట్రాల కూడలిలో, తమిళనాడు రాష్ట్ర పరిధిలో, నీలగిరి కొండల్లో వుంది ఊటీ. సముద్ర మట్టానికి 2240 మీటర్ల ఎత్తులో వుంటుంది. అందుకే దీన్ని క్వీన్ ఆఫ్ హిల్ స్టేషన్స్‌గా పిలుస్తారు. ఇక్కడ వాతావరణం వేసవిలో గరిష్టంగా 25, కనిష్టంగా 10 డిగ్రీలు, చలికాలంలో గరిష్టం 21, కనిష్టం 0 డిగ్రీలుగా నమోదవుతుంటుంది. చలికాలంలో పగటి పూటగూడా మంచు కురుస్తూ వుంటుంది.

చూడాల్సిన స్థలాలు

ఊటీలో అత్యంత ఎత్తయిన ప్రదేశం దొడ్డబెట్ట, ఊటీ సరస్సు, రోజాపూల వనం, బొటానికల్ గార్డెన్, తేయాకు తోటలు, ఫ్యాక్టరీ ముఖ్యమైనవి. దొడ్డబెట్ట అంటే ఎత్తయిన కొండ అని అర్థం. ఇది 2634 మీటర్ల ఎత్తులో వుంటుంది. ఊటీ బస్టాండు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఇది వుంటుంది. అక్కడికెళితే మనకు మేఘాల మధ్య వున్నామన్న భావన కలుగుతుంది. మంచు కురుస్తూ ఒణుకు పుట్టిస్తూ వుంటుంది వాతావరణం. చలికాలంలో అయితే అసలు అక్కడికి వెళ్లలేం. ఏమైనా దొడ్డబెట్టకు వెళితే ఒక విచిత్రమైన అనుభూతి కలుగుతుంది. అక్కడ ఏ క్షణంలో వర్షం కురుస్తుందో, ఏ క్షణంలో ఆగిపోతుందో చెప్పలేం. ఆ వాన చినుకులు కూడా మంచు బిందువుల్లాగా టప్ టప్ మంటూ పెద్ద సైజులో పడుతుంటాయి. చూట్టానికి అదో తమాషాగా అన్పిస్తుంది. అందుకే అక్కడ సందర్శకుల కోసం గొడుగులు అద్దెకు ఇస్తుంటారు. వాన కురిసినపుడు గొడుగు వేసుకుని పైకి వెళ్లి ఊటీ అందాన్ని ఆస్వాదించవచ్చు. బొటానికల్ గార్డెన్ 22 హెక్టార్లలో విస్తరించి వుంది. 1847లో అప్పటి మద్రాసు గవర్నర్ దీన్ని ఏర్పాటు చేశారు. ఆరు భాగాలుగా వున్న ఈ గార్డెన్‌లో పురాతనమైన చెట్లు, అరుదైన మొక్కలు వున్నాయి. చాలా సినిమాల్లో ఈ గార్డెన్‌ను మనం చూసేవుంటాం. ఊటీకి హైలెట్ ఊటీ సరస్సు. ఇది బస్టాండుకు అతి దగ్గర్లో వుంటుంది. 65 హెక్టార్లలో విస్తరించిన ఈ సరస్సులో విహారంతో ఊటీ పర్యటన పతాక స్థాయికి చేరుతుంది. 1824లో బ్లూహిల్స్ ప్రాంతంలో కృత్రిమంగా ఈ సరస్సును ఏర్పాటు చేశారు.


ఊటీ సరస్సు

ఇక్కడ ఏర్పాటు చేసిన పడవల్లో 'లాహిరి లాహిరిలో...' అంటూ విహరిస్తూ ఎత్తయిన నీలగిరి చెట్ల మధ్య తిరుగుతుంటే గొప్ప అనుభూతి సొంతమవుతుంది. రోజాపూల వనం - ఊటీ అందాల కురులలో తురిమిన కుసుమ రాజం. విజయనగరం అనే ప్రాంతంలో 4 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ వనంలో 2 వేల రకాలకు చెందిన 20 వేలకుపైగా రోజా మొక్కలకు విరబూసిన పూలు మనసును ఆనంద పరవశం చేస్తాయి. ఊటీ బోట్‌క్లబ్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన కృత్రిమ పూల మొక్కల ప్రదర్శనా తప్పక తిలకించాల్సిందే. ఇంకా ఆర్ట్ గ్యాలరీ, ఇతర సందర్శనీయ స్థలాలు ఉన్నాయి. ఊటీ కన్నా 200 మీటర్లు తక్కువ ఎత్తులో, ఊటీ నుంచి 19 కిలోమీటర్ల దూరంలో వున్న కూనూరు కూడా సందర్శనీయ స్థలాల ఖిల్లా. ఊటీకి ఏ మాత్రం తీసిపోని వనాలు, సందర్శన స్థలాలు ఇక్కడున్నాయి. డాల్ఫిన్ నోస్, లింబస్ రాక్ వంటి స్థలాలు ఇక్కడున్నాయి. ఊటీకి వెళ్లిన ప్రతి ఒక్కరూ కూనూరునూ సందర్శిస్తారు. ఊటీలోగానీ, కూనూరులోగానీ టీ ఎస్టేట్‌లను, టీ తయారీ పరిశ్రమలను చూడొచ్చు. ఇందుకు తగిన ఏర్పాట్లు కూడా అక్కడున్నాయి.





మరుపురాని రైలు ప్రయాణం

ఊటీ సందర్శన ఒక మధురానుభూతి అయితే.... ఊటీకి రైలు ప్రయాణం అద్భుతమైన అనుభూతి. చిన్న పిల్లలకే కాదు పెద్దలు కూడా కేరింతలు కొట్టాలనిపించే ఉత్సాహం కలిగిస్తుంది రైలు ప్రయాణం. 2,240 మీటర్ల ఎత్తున్న కొండలపైకి నత్తలాగా రైలు సాగించే ప్రయాణం వింతగా అనిపిస్తుంది. మేటుపాలెం నుంచి ఊటీకి 40 కిలోమీటర్ల దూరం మేర రైల్వే లైను బ్రిటీష్ కాలంలోనే నిర్మించారు. ఐదు బోగీలు మాత్రమే వుండే ఈ టాయ్ ట్రయిన్ వెనక్కి నడుస్తుంది. రెండు పట్టాల మధ్య మరో పట్టా (పళ్ల పట్టా) వుంటుంది. ఇంజను వెనుకవైపు నుంచి నెడుతుంటే, రైలు ఆ పళ్ల పట్టాను ఆధారంగా చేసుకుని పైపైకి ఎక్కుతుంది. మార్గమధ్యంలో అనేక జలపాతాలు, లోయలు, గుహలు ప్రయాణీకులను ఉక్కిరిబిక్కిరయ్యేలా చేస్తాయి. మధ్యమధ్యలో స్టేషన్ల వద్ద ఆగడంతో ఫొటోలు తీసుకోడానికి కూడా అవకాశం వుంటుంది. 40 కిలోమీటర్ల దూరాన్ని చేరుకోడానికి ఐదు గంటలు పడుతుందంటే రైలు ఎంత మెల్లగా వెళుతుందో అర్థం చేసుకోవచ్చు. మేటుపాలెం నుంచి ఊటీ వెళ్లడానికి బస్సు మార్గం కూడా వుంది. ఇటు మైసూరు వైపు నుంచి, అటు కేరళ నుంచీ బస్సు మార్గాలు వున్నాయి. బస్సు మార్గాలు ఎన్ని వున్నా రైల్లో వెళితే మంచి అనుభూతి పొందవచ్చు. అయితే సీజన్‌లో ఉదయం 7, 9 గంటలకు రెండు పర్యాయాలు మాత్రమే రైలు వుంది. సీట్లు కూడా పరిమితం కాబట్టి ముందే రిజర్వు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా ఎక్కడ నుంచయినా రిజర్వు చేసుకోవచ్చు.


టీ ఫ్యాక్టరీ

ఎక్కడ బస చేయాలి?

ఊటీకి వెళ్లడానికి సీజన్లు వున్నాయి. ప్రధానంగా వేసవి కాలంలోనే ఎక్కువ మంది సందర్శకులు ఊటీకి వెళుతుంటారు. ఏప్రిల్-జూన్, సెప్టెంబర్-నవంబర్ నెలలు సీజన్. బస చేయడానికి అన్ని తరగతులవారికి తగినట్లు లాడ్జీలు, హోటళ్లు వున్నాయి. అయితే సీజన్‌లో ధరలు ఎక్కువగానూ, అన్ సీజన్‌లో తక్కువగానూ వుంటాయి. ఊటీకన్నా కూనూరులో బస చేయడం వల్ల కాస్త డబ్బులు ఆదా అవుతాయి. ఇక సందర్శన స్థలాలు చూపించడానికి లెక్కకు మించి ట్రావెల్ ఏజన్సీలు వున్నాయి.

సూచన

కనీసం ఒక రాత్రయినా ఊటీలో బస చేసేలాగా ప్రణాళిక సిద్ధం చేసుకుని వెళితే బాగుంటుంది. అలాగే మన రాష్ట్రంవారు వెళ్లేటప్పుడు కోయంబత్తూరు మీదుగా మేటుపాలెం వెళ్లి, అక్కడ నుంచి రైల్లో ఊటీ వెళ్లి, ఊటీ సందర్శన అనంతరం తిరుగు ప్రయాణంలో బస్సు మార్గంలో మైసూరు, బెంగుళూరు వెళ్లి, ఆ ప్రాంతాలనూ సందర్శించేలా ప్రణాళిక వేసుకుంటే ప్రయాణం లాభదాయకంగానూ, సమయోచితంగానూ వుంటుంది. ❄

(ఫొటోలు -నరహరి)



తెర

కాంగ్రెసేతర పార్టీల ఉద్యమాలు వూపందుకున్న నేపథ్యంలో రంగ ప్రవేశం చేసిన సినీనటుడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ 1983లో రాజకీయ ప్రభంజనం సృష్టించి అధికారం హస్తగతం చేసుకుంది. తర్వాతదంతా తెలిసిన చరిత్రే. ఇప్పుడు మళ్లీ కొత్త పక్షాల సూచనలు కొత్త కలయికల మధ్య ఫలితాలు ఎలా వుండబోతాయని ఎవరి వూహాగానాలు వారు చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో గత ఫలితాలను ఒక్కసారి సింహావలోకనం చేస్తే తప్ప ఎవరైనా ఒక ప్రాథమిక అంచనాకు రాలేరు. సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు రూపొందించిన 'తెలుగు ప్రజా తీర్పు' పుస్తకం అందుకు చక్కగా ఉపయోగపడుతుంది.



ఓట్ల గణాంకాలు సీట్ల పురాణాలు

ప్రభుత్వాధినేత 'ప్రజా పథం...' ప్రతిపక్ష నేత 'మీ కోసం' .. టిఆర్ఎస్ రాజీనామాలతో ఉప ఎన్నికలు... మెగా స్టార్ రాజకీయ ప్రవేశంపై వ్యూహాగానాలతో ఎడతెగని 'నిరీక్షణ'లు... వీటన్నిటి మధ్యా ఎన్నికల వేడి పెరుగుతున్న స్థితి. భవితవ్యం ఎలా వున్నా ప్రస్తుతానికి అందరిలో ఉత్కంఠ. ఉద్విగ్నత.. ఎవరి బలం ఎంతో పోటీలో తేల్చుకునేముందు రకరకాల అంచనాలు, వాదోపవాదాలు.. మీడియాలో నిరంతర కథనాలు, సవాళ్లు ప్రతి సవాళ్లు.. షరా మామూలుగా సాగిపోతున్నాయి.ఎవరికి వారు తమదే విజయం అన్నట్టు చెప్పుకుంటుంటే అందులో ఏది అతిశయోక్తి... ఏది వాస్తవం... తెలుసుకోలేని సగటు మనుషుల సందిగ్ధతలు. ఇప్పుడు బహిరంగంగానే రాజకీయ రేఖలు గీసుకున్న ప్రసార సాధనాలలో వచ్చే సమాచారాలను ఎంత వరకూ విశ్వసించాలనేదానిపై శిబిరాలను బట్టి సందేహాలు.. ముందస్తు ఎన్నికల గురించిన కథనాలు ప్రస్తుతానికి తగ్గినా అసలు ఎన్నికలు కూడా ఏడాదిలో ఎలాగూ రావలసిందే. అందుకే పాలకవర్గ పక్షాలలో ఇంత హడావుడి, అలజడి.

ఇన్నిటి మధ్యనా వాస్తవ పరిస్థితిని కనీసం గతానికి సంబంధించినంతవరకైనా సుస్పష్టంగా తెలుసుకోవడానికి ఒకే ఒక మార్గం ఎన్నికల గణాంకాలు. ఎందుకంటే ఎన్నికలు ఇప్పుడే మొదలవలేదు. దీంతోనే ముగిసిపోవడం లేదు. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటి ఎన్నికల ప్రక్రియ నిరంతరాయంగా సాగిపోతూనే వుంది. ఆయా సందర్భాలలో రంగంలో నిలిచిన వేర్వేరు శక్తులకూ పక్షాలకూ ఓటర్లు జయాపజయాలు కలిగిస్తూనే వున్నారు. వాటన్నిటినీ ఒకసారి బేరీజు వేసుకుంటే వాస్తవ బలాబలాలు సగం తెలిసిపోతాయి. ఎప్పుడో అరుదుగా సంచలన పరిణామాలు కలిగితేనో, బలీయమైన కొత్త శక్తులు రంగంలోకి దిగితేనో తప్ప మొత్తం బలాబలాలు మౌలికంగా మారిపోవు. ఉదాహరణకు గత పాతికేళ్లలోనూ ప్రధాన పక్షాలైన కాంగ్రెస్ తెలుగు దేశంలలో ఏది గెలిచినా ఏది ఓడినా అయిదు శాతం ఓట్లకు మించి తేడా లేదు. అదే సీట్లలోకి వచ్చే సరికి గణనీయమైన తేడా తెచ్చిపెడుతుందంటే అందుకు మన ఎన్నికల పద్ధతే కారణం.ఇక్కడ యాభై ఒక్క శాతం వచ్చిన వాడు మొత్తం గెలిస్తే 49 శాతం వచ్చినా ఏ ప్రయోజనం వుండదు. ఒక విధంగా ఇది అశాస్త్రీయమైన ఎన్నికల పద్ధతి. అయినా వున్నది ఇదే గనక దీన్నే అనుసరించక తప్పదు. దీన్నిబట్టి లెక్కలు తీసుకోకా తప్పదు.

1952 నుంచి చూస్తే రాష్ట్రంలో రాజకీయాలు అనేక మలుపులు తిరిగాయి. రాష్ట్ర స్వరూపమూ రాజకీయ పార్టీల స్వరూపమూ కూడా అనేక మార్పులకు గురైనాయి. ఉదాహరణకు 1952లో ఆంధ్ర ప్రాంతం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా వుంది. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం అనంతరం జరిగిన ఆ ఎన్నికల్లో ఆంధ్రప్రాంతంలో కమ్యూనిస్టులు ప్రథమ శక్తిగా వచ్చారు. తెలంగాణాలోనూ పిడిఎఫ్ పేరుతో పోటీ చేసి కాంగ్రెస్‌కు దరిదాపుల్లో సీట్లు సాధించారు. రెండు చోట్లా కలిసి కాంగ్రెస్‌కు 84, కమ్యూనిస్టులకు 78 సీట్లు ఆనాడు దక్కాయంటే పరిస్థితి తెలుస్తుంది. అదే 1955 మధ్యంతర ఎన్నికలకు వచ్చేసరికి కమ్యూనిస్టులకు అంతకు ముందు కన్నా ఎక్కువగా 30 శాతం ఓట్లు వచ్చినప్పటికీ సీట్లు మాత్రం 41 నుంచి 15కు పడిపోయాయి. ఇందుకు రాజకీయ పొందికల్లో వచ్చిన మార్పులే కారణం. అనేక కారణాల వల్ల తర్వాత 60,70 దశకాలలో కాంగ్రెస్ గుత్తాధిపత్యం కొనసాగింది. కాంగ్రెసేతర పార్టీల ఉద్యమాలు వూపందుకున్న నేపథ్యంలో రంగ ప్రవేశం చేసిన సినీనటుడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ 1983లో రాజకీయ ప్రభంజనం సృష్టించి అధికారం హస్తగతం చేసుకుంది. తర్వాతదంతా తెలిసిన చరిత్రే.ఇప్పుడు మళ్లీ కొత్త పక్షాల సూచనలు కొత్త కలయికల మధ్య ఫలితాలు ఎలా వుండబోతాయని ఎవరి వూహాగానాలు వారు చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో గత ఫలితాలను ఒక్కసారి సింహావలోకనం చేస్తే తప్ప ఎవరైనా ఒక ప్రాథమిక అంచనాకు రాలేరు.

సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు రూపొందించిన 'తెలుగు ప్రజల తీర్పు' అనే పుస్తకం అందుకు చక్కగా ఉపయోగపడుతుంది. 1952 నుంచి 2004 వరకూ జరిగిన రాష్ట్రం నుంచి లోక్‌సభ, శాసనసభలకు జరిగిన అన్ని ఎన్నికలకు సంబంధించిన ఓట్లు, అభ్యర్థుల పార్టీల వివరాలు సంపూర్ణంగా ఇందులో పొందు పర్చారు. ఎన్నికల సంవత్సరంలో ఇది ఒక సమాచార దర్శినిగా వుంటుంది. ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన జరిగినప్పటికీ వాటి గురించి అవగాహనకు రావడానికి ఇప్పటికీ ఈ లెక్కలే ప్రాతిపదికగా వుంటాయి.

తెలుగు ప్రజల తీర్పు- పరిచయం అన్న 'ముందు మాట'తో రచయిత ఈ పుస్తకాన్ని ప్రారంభించారు. మొత్తం ఎన్నికల చరిత్రను అందులో ముఖ్య ఘట్టాలను వివరించారు. తద్వారా ప్రారంభంలోనే పాఠకుడికి రాజకీయ చరిత్ర గురించిన కొంత అవగాహన కలిగించేందుకు ప్రయత్నించారు. అందులోనూ ఆసక్తిగా వుండే రాజకీయాంశాలనూ, నాయకుల వ్యక్తిగత జయాపజయాలను కూడా క్లుప్తంగా పొందుపర్చారు.

ఇక ఆ తర్వాత జిల్లాల వారీగా శాసనసభ నియోజకవర్గాలలో వివిధ ఎన్నికల ఓట్ల వివరాలు, గెలిచిన వారు, సమీప ప్రత్యర్థి వగైరా వివరాలిచ్చారు. ఒకవేళ అక్కడ ఏదైనా ప్రత్యేకత వుంటే పేర్కొన్నారు. ఉదాహరణకు ఒకే అభ్యర్థి లేదా కుటుంబం విజయాలు సాధించడం, అభ్యర్థులు వారే అయినా పార్టీలు మారడం ఇలాంటి వ్యాఖ్యానాలు ఇచ్చారు. అలాగే నియోజకవర్గాల పేర్లు మారి వుంటే తెలియజేశారు. వీటన్నిటి వల్లా ఈ పట్టికలు రెఫరెన్సుగానే గాక పఠనీయంగానూ తయారైనాయి. మొత్తం శాసనసభ ఎన్నికల వివరాలు 300 పేజీలకు పైగా వున్నాయి. ఆ తర్వాత ఆయన భారత రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు, లోక్‌సభ స్పీకర్లు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులు తదితరుల పేర్లు పదవీ కాలాలు పొందుపర్చారు. శాసనసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనవారు, ఎక్కువ సార్లు గెలిచిన ఎంఎల్ఏలు, మహిళా ఎంఎల్ఏలు తదితర విశేషాలు కూడా ఇచ్చారు. 2004 ఎన్నికల గణాంకాలు ఇచ్చిన తర్వాత మరో రెండు పేజీలలో ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికల ఓట్ల వివరాలు, శాతాలు తదితర లెక్కలు ఇచ్చారు. అయితే గెలిచిన వారు, రెండో స్థానాల్లో వచ్చిన వారు తప్ప పోటీ చేసిన వారందరి వివరాలు లేకపోవడం ఒక లోటే.

ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు తీసుకుని నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు, మెజార్టీ ఇచ్చారు. లోక్‌సభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వారి పేర్లు, ఎక్కువ సార్లు గెలిచినవారి పేర్లు ఇచ్చారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన రాజ్యసభ సభ్యుల పేర్ల పట్టిక ఇచ్చారు. అలాగే గతంలో శాసనమండలి సభ్యులుగా పనిచేసిన వారి వివరాలిచ్చారు. ఈ అదనపు వివరాలు ఎన్నికల కమిషన్ ప్రచురణల్లో దొరకనివే.

కొమ్మినేని శ్రీనివాసరావు శ్రద్ధాసక్తులతో కూర్చిన ఈ పుస్తకం రాజకీయాలలో వున్నవారు, మీడియా మిత్రులు, ఎన్నికలలో పోటీ చేయగోరే భావి అభ్యర్థుల అవశ్యంగా దగ్గర వుంచుకోదగింది.

తెలుగు ప్రజాతీర్పు
1952-2004
52 ఏళ్ల ఎన్నికల రాజకీయ విశ్లేషణ
కొమ్మినేని శ్రీనివాసరావు
రూ: 200/-, పేజీలు:360,
ప్రతులకు: ప్రజాశక్తి, విశాలాంధ్ర, నవోదయ అన్ని బ్రాంచీలు.









సీరియల్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

అమెరికన్ డేగ

స్పాటెడ్ టెయిల్

జరిగినకథ:

దారిలో, అనేకమంది వృద్ధులూ, పన్నెండుమంది పిల్లలూ చలికి గడ్డకట్టుకుపోయి మరణించారు. గత్యంతరం లేక, కొన్ని గుర్రాల నుండి, పొట్టలోని పేగులూ, ఇతర అవయవాలు తీసి పిల్లల్ని అందులో పడుకోబెట్టి చలి నుండి రక్షించారు. వృద్ధులు కాళ్లూ, చేతులూ లోపల పెట్టుకొని రాత్రి గడిపారు. మంచులో మూడు రోజులు అలా ప్రయాణం కొనసాగింది. కాళ్లకూ, చేతులకూ నెత్తురు అట్టలు కట్టింది. నడిచిన దారంతా, తెల్లటి మంచు మీద ఎర్రటి పాదముద్రలు శత్రువుకు దారి చూపించాయి.

(50వ భాగం)

తన అతిథులను అన్ని విధాలా అడ్డుకున్న క్రేజీ హార్స్, "ఇక్కడ కూడా క్షేమం లేదు. మళ్ళీ పరిగెత్తటానికి సిద్ధంగా వుండండి" అని హెచ్చరించాడు. ఓగ్లాలాల వద్ద ఆయుధాలు సరిగా లేవు. మందుగుండు సామాగ్రి కూడా నిండుకుంది.

మైల్స్ వీళ్ళకోసమే గాలిస్తున్నాడు. మరోవైపు జనరల్ క్రూక్ దళాలు తరలి వస్తున్నాయి. ప్రాణాలు అరచేతపట్టుకుని, వున్న చోట వుండకుండా పరిగెత్తారు ఇండియన్లు.

"మూన్ ఆఫ్ పాపింగ్ ట్రీస్" (రుతువులో టంగ్‌రివర్ వద్ద, ఫోర్ట్ కియోగ్‌కు వెనకవున్న రహస్య స్థలానికి తన క్యాంపుకు తరలించాడు క్రేజీహార్స్. ఆ సమయంలో, బేర్‌కోట్ కూడా ఫోర్ట్‌లోనే తన తాత్కాలిక హెడ్‌క్వార్టర్స్ ఏర్పాటు చేసుకున్నారు. చలికీ, ఆకలికీ తట్టుకోలేక, కొందరు వృద్ధులు, పిల్లలు, బేర్‌కోట్‌తో మంతనాలు జరిపి సమస్యను పరిష్కరించుకుందాం అన్నారు. ఆహారం లేక ఇక వుండలేరు. చలికి పిల్లలు చచ్చిపోతున్నారు. కడుపు నిండాలి. వెచ్చటి గూడు కావాలి. మూర్‌కోట్స్ తమనందర్నీ ఖైదు చేసి రిజర్వేషన్‌కు తరలిస్తాడని క్రేజీహార్స్‌కు తెలుసు. కాని ఇలా మాడిపోవటం కన్నా బందీలుగా ఒకటవటమే మేలనుకుంటున్నారు కొందరు. ముప్పైమంది అనుచరులతో పోర్టుకు బయల్దేరాడు క్రేజీహార్స్. వీళ్లలో ఎనిమిది మంది (ప్రాణాలకు తెగించిన) యోధులు. ఒక బరిసెకు తెల్లగుడ్డ చుట్టి శాంతి సందేశంతో అద్వాన్సుగా కోట సింహ ద్వారం చేరుకున్నారు. ఆదేశాల ప్రకారం, లోపల్నించి పరుగెత్తికొచ్చిన కిరాయి సైనికులు (కో తెగవాళ్లే) వీళ్ల మీద పాయింట్ బ్లాక్ రేంజీలో కాల్పులు జరిపారు. ఎనిమిది మందిలో ముగ్గురే ప్రాణాలతో బయటపడ్డారు. కొండల పైనుండి ఇదంతా గమనించిన సియోలు ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నారుగాని, క్రేజీహార్స్ వాళ్లను, బలవంతంగా క్యాంపుకు తిరిగి పంపాడు. "సియోలు ఇంత సమీపంలో వున్నారని తెలిస్తే బేర్‌కోట్ మంచును కూడా లెక్కచేయకుండా వచ్చి మారణహోమం సృష్టిస్తాడు. మనం తక్షణం ఈ ప్రాంతం ఖాళీ చెయ్యాలి" అంటూ ప్రయాణ సన్నాహాలు ప్రారంభించాడు క్రేజీహార్స్.

కాని బేర్‌కోట్ వాళ్లను వదల్లేదు. 1877, జనవరి నాటి ఉదయం, మోకాటిలోతు మంచుతో బ్యాటిల్ బట్ వద్ద సైనికులు వలపన్ని అందర్నీ పట్టుకోగలిగారు. క్రేజీ హార్స్ వద్ద ఆయుధాలు లేవు. మందుగుండు సామాగ్రి నిండుకున్నది. శత్రువుల కళ్ళు గప్పి పారిపోగలిగిన కొద్ది మంది వీరులు మాత్రమే అతనికున్న బలం. వీళ్ళు, తెల్లవాళ్లను దారి మళ్లించి గందరగోళం సృష్టించినప్పుడే, మిగతా ఇండియన్లు వూల్ఫ్ మౌంటెన్స్ గుండా, బిగ్‌హార్న్ వైపు పారిపోయారు. టై మూన్, హంప్ కలిసి సైన్యాలను లోయలోకి నెట్టేశారు. బరువైన శీతాకాలపు యూనిఫాంలతో వేగంగా కదలలేని తెల్లవాళ్లు మంచుకొండల మీద జారిపడి గాయాలు తగిలించుకున్నారు. ఈ పిల్లీ-ఎలుక యుద్ధం జరుగుతున్నంత కాలం మంచు కరుస్తూనే ఉంది. మాధ్యాహ్నానికి అది తీవ్రమైన తుఫానుగా మారింది. ఇండియన్లు తప్ప మరెవరూ తట్టుకోలేని వాతావరణ పరిస్థితి. బేర్‌కోట్ తన సైనికులను ఫోర్ట్ కియోగ్‌కు తిరిగి వెళ్లమన్నాడు. (లేకపోతే ఆనాడందరూ మంచు సమాధి కావలసిన వాళ్లే).

ఆ మంచు తెరలే రక్షణ కవచంగా, క్రేజీ హార్స్ మనుష్యుల్ని సురక్షితమైన 'లిటిల్ 'పౌడర్ వైపు నడిపించాడు. ఫిబ్రవరి అంతా అక్కడే

"ఆ యిద్దరు జైలు అధికారుల మధ్య నడుస్తున్నప్పుడు క్రేజీహార్స్ తన 'వాస్తవ' ప్రపంచంలోకి జారుకున్నట్టుగా కలలు కనేవుంటాడు. నీడ లాంటి ఈ పిచ్చి ప్రపంచం తనను కబళించకుండా జాగ్రత్తపడాలి. దారిలో భుజం మీద రైఫిల్ పెట్టుకున్న గార్డు ఒకడు కనిపించాడు. ఎదురుగా ఒక బిల్డింగు కిటికీ తలుపు తెరచి వుంది. బిల్డింగ్ లోపల కాళ్లకూ, చేతులకూ ఇనుప సంకెళ్లతో మనుషులు. జంతువులను ఇలా కట్టి పడేస్తారు. తనకు కూడా ఈ శిక్ష వేస్తారా? తను జంతువా? ఒక్కసారి లంఘించాడు. లిటిల్ బిగ్‌మూన్ అతడి భుజం పట్టుకొని ఆపటానికి ప్రయత్నించాడు. కొద్ది సెకండ్ల పాటు పెనుగులాట జరిగింది. గార్డ్ కమాండర్ పెద్దగా అరిచాడు."

గడిపారు. స్పొటెడ్ టెయిల్ ఇతర బ్రూల్స్ వస్తున్నారని ఒకనాడు వార్త తీసుకొచ్చారు స్కౌట్లు. వాళ్లకు 'రిజర్వేషన్ జీవితం' మొహం మొత్తింది కాబోలు అనుకున్నారందరూ. కాని అసలు కారణమేమిటో క్రేజీహార్స్‌కు తెలుసు.

* * *

చలి తీవ్రత భరించలేక, జనరల్ క్రూక్ తన సైన్యాలను ఫోర్ట్ ఫెటర్‌మాన్‌కు తరలించాడు. స్పొటెడ్ టెయిల్ కూడా సమీపంలోనే బస చేశాడని తెలిసి, సమాచారం పంపించాడు.

సియోలు తమ మిత్రులనీ, క్రేజీహార్స్‌ను లొంగిపొమ్మని ఒప్పించగలిగితే, అన్ని సౌకర్యాలూ కల్పిస్తాననీ నమ్మబలికాడు. క్రేజీహార్స్ క్యాంప్‌కు స్పొటెడ్ టెయిల్ వెళ్లిన కారణమిదే.

స్పొటెడ్ టెయిల్ రావటానికి కొద్ది రోజుల ముందే క్రేజీహార్స్ క్యాంపు వదిలి వెళ్లిపోయాడు. అతని తండ్రి, 'అతిథిని ఆహ్వానించు, చలి తగ్గిన తరువాత ఓగ్లాలాలు తిరిగి వస్తారు' అని చెప్పాడు. అసలు సంగతేమిటంటే, లొంగి పోవటాన్ని గురించి క్రేజీ హార్స్ ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదు. తన మనుషులకు రిజర్వేషన్‌కు పంపి, తను మాత్రం పౌడర్ రివర్ కంట్రీలోనే అడవి దున్నలాగా స్వేచ్ఛగా తిరగాలని అతని కోరిక.

క్రేజీహార్స్‌కు తనను కలిసే వుద్దేశం లేదనుకున్నాడు స్పొటెడ్ టెయిల్. ఒక్కసారి మాట్లాడుకుందామని సందేశం పంపాడు. కాని అప్పటికే, క్రేజీహార్స్ మంచు కొండల్లో మాయమైపోయాడు. అనుచరులు కూడా అతని ఆచూకీ కనిపెట్టలేకపోయారు. అయితే, తిరిగి నెబ్రాస్కాకు చేరుకునే లోపు తను మిన్నెకాంజూ అనుచరులను లొంగి పోవటానికి బిగ్‌ఫుల్‌ను మాత్రం ఒప్పించగలిగాడు. టచ్ ది - క్లౌడ్ (పేరు), మరో ముగ్గురు నాయకులు కూడా స్పొటెడ్ టెయిల్ ప్రతిపాదనలను అంగీకరించారు.

ఏప్రిల్ 14 నాడు, టచ్ - ది- క్లౌడ్స్ అనేక మంది మిన్నెకాంజూలు, సాన్ ఆర్క్‌లతో (వీరంతా క్రేజీహార్స్ గ్రామానికి చెందిన వాళ్ళు) స్పొటెడ్ టెయిల్ ఏజెన్సీకి వచ్చి లొంగి పోయారు. ఇది జరగటానికి కొద్ది రోజుల ముందు, క్రేజీ హార్స్ లొంగిపోతే, పౌడర్ రివర్ కంట్రీలోనే అతడి ఏజెన్సీ ఏర్పాటు చేస్తానని రెడ్‌క్లౌడ్‌తో ఒక సందేశం పంపించాడు. ఏప్రిల్ 27 నాడు రెడ్‌క్లౌడ్ క్రేజీహార్స్‌ల సమావేశం జరిగింది.

ఓగ్లాలాలు (క్రేజీహార్స్ తెగ) ఆకలికి అలమటిస్తున్నారు. ఆయుధాల్లేవు. గుర్రాలు బక్క చిక్కి నడవలేక పోతున్నాయి. "పౌడర్ రివర్ కంట్రీలోనే" అంటే తమకు స్వేచ్ఛ దొరికినట్టే. తెల్ల సైనికులకు భయపడి రహస్యంగా బతకనక్కర్లేదు. ఫోర్ట్ రాబిన్సన్ కెల్లి లొంగి పోవటానికి అభ్యంతరం చెప్పనక్కర్లేదు.

అలా, చివరి సియో నాయకుడు కూడా రిజర్వేషన్‌లో బతకటానికి అంగీకరించాడు. ఇప్పుడు ఆయుధాలుండవు. గుర్రాలుండవు. తెగవాళ్ళు తనను నాయకుడిగా అంగీకరించరు. సైనికుల పహారాలలో బతికే ఒక బందీగా రోజులు గడపాలి. యుద్ధంలో అతణ్ణి ఓడించలేని తెల్లవాళ్ళు, కుట్రచేసి లొంగదీసుకున్నారు. రిజర్వేషన్‌లో కూడా యువకులు క్రేజీహార్స్‌ను తమ హీరోగానే భావించారు. ఈ వల్లమాలిన అభిమానంలో ఇతర నాయకుల్లో అసూయ పెరిగింది. "జనరల్ క్రూక్, తను చేసిన వాగ్దానాలు నిలబెట్టుకుంటే లొంగి పోవటం సత్ఫలితాలనిచ్చిందని అందరూ నమ్ముతారు" అనుకున్నాడు క్రేజీ హార్స్. పౌడర్ రివర్ కంట్రీలో రిజర్వేషన్‌లో ఏర్పాటయ్యే రోజు కోసం అందరూ నిరీక్షించారు.

వేసవి కాలంలో, గ్రేట్ ఫాదర్‌తో చర్చించటానికి క్రేజీహార్స్‌ను వాషింగ్టన్ వెళ్లమన్నాడు జనరల్ క్రూక్. తనెందుకెళ్లాలి! క్రేజీహార్స్ నిరాకరించాడు. ఇంక చర్చలనవసరం. వాగ్దానాలు నెరవేర్చటమే తరువాయి. వాషింగ్టన్‌కు వెళ్ళి వచ్చిన నాయకులకేమైందో స్వయంగా చూశాడు. అందరూ అక్కడ జల్సాలు చేసి, తెగబలిసి, పొట్టలు పెంచుకొని, నున్నగా తయారై వచ్చారు. ఒక్కసారి, ఆ జీవితం రుచి చూస్తే, తమలో వుండే కరకుదనం పోతుంది. రెడ్‌క్లౌడ్, స్పొటెడ్ టెయిల్ మారిన జీవిత పద్ధతులే ఇందుకు నిదర్శనం.

షైనింగ్ మౌంటెన్స్‌లో వుంటున్న నెజ్ పెర్స్ (ఒక తెగ) సైనికులతో తరచూ యుద్ధం చేస్తున్నారని తెలిసింది. అది ఆగస్టు నెల. ఏజెన్సీలలో తెల్ల కమాండర్లు, (ఇండియన్) స్కౌట్లను పంపి నెజ్ పెర్స్ కదలికల గురించి సమాచారం సేకరించారు. తమ వాళ్ళకు వ్యతిరేకంగా పని చెయ్యటం మంచిది కాదని యువకులకు (స్కౌట్లకు) సలహా ఇచ్చాడు క్రేజీ హార్స్. కాని బహుమతుల ప్రలోభంలో కొందరు వినలేదు. క్రమంగా తెల్లవాళ్ళు సియోలను పూర్తిగా లొంగదీసుకున్నారు. ఇది ఎంత దాకా పోయిందంటే, ఆగస్టు 31 నాడు, ఒకప్పుడు క్రేజీ హార్స్‌కు నమ్మిన బంట్లుగా వున్న యువకులు ఆర్మీ యూనిఫారాలు ధరించి సాటి ఇండియన్లను వేటాడటానికి బయల్దేరారు. క్రేజీహార్స్ మనస్తాపంతో కుంగి పోయాడు. సుఖలాలసత ఇంత పని చేయిస్తుందన్నమాట. మిగతావాళ్లను తీసుకొని, రిజర్వేషన్ దాటి పౌడర్ రివర్ కంట్రీకి వుత్తరంగా తరలిపోయాడు.

క్రేజీహార్స్ నిష్క్రమణ జనరల్ క్రూక్‌కు కోపం తెప్పించింది. దీని పరిణామాలు తీవ్రంగా వుంటాయి. ఫోర్ట్ రాబిన్ సన్ వెలుపల క్యాంప్‌లో వున్న క్రేజీ హార్స్‌ను అరెస్టు చెయ్యమని ఎనిమిది కంపెనీల అశ్విక దళాన్ని పంపించాడు. సైనికులు వస్తున్నారని తెలిసినా కారణం తెలియదు. తన వాళ్ళను దూరంగా పారిపొమ్మని చెప్పి, టచ్ - ది - క్లౌడ్‌ను కలవటానికి , స్పొటెడ్ టెయిల్ ఏజెన్సీకి ఒంటరిగా బయల్దేరాడు క్రేజీహార్స్.

ఇందులో రహస్యమేమీలేదు. సైనికులతణ్ణి సులభంగా అరెస్టు చేశారు. ఫోర్ట్ రాబిన్సన్ జనరల్ క్రూక్ ముందర ప్రవేశపెట్టి, అధికారి మెప్పు పొందాలని వాళ్ళ కోరిక. ఫోర్ట్‌కు చేరేసరికి సాయంత్రమైంది. ఆ సమయంలో జనరల్ ఎవర్నీ చూడలేదు. రాత్రికి, అతణ్ణి కెప్టెన్ జేమ్స్ కెన్నింగ్టన్, మరో ఏజెన్సీ పోలీస్ మాన్ రక్షణలో వుంచారు. క్రేజీహార్స్ ఆ ఇద్దర్నీ ఎగాదిగా చూశాడు. ఏజెన్సీ పోలీస్ మాన్ మరెవరో కాదు.

లిటిల్ బిగ్‌మాన్ యిప్పుడీ వుద్యోగం చేస్తున్నాడు. పాహాసాపా వద్ద కమిషనర్లను ఎదిరించి నిలిచిన మానధనుడా ఇతడు! బ్లాక్‌హిల్స్‌ను అమ్మటానికి వీల్లేదు. ఆ ప్రయత్నం చేసినవాళ్లను స్వయంగా చంపుతున్నాడు! తనతో కలిసి, వుల్ఫ్ మౌంటెన్స్‌లోని మంచు శిఖరాల మీద బెర్‌కొటెమైల్స్‌తో ప్రాణాలకు తెగించి యుద్ధం చేసిన వీరుడు! చివరికి, తెల్ల వాళ్ళకు అమ్ముడు పోయి ఏజెన్సీ పోలీసుగా మారిన భీరువు.

ఆ యిద్దరు జైలు అధికారుల మధ్య నడుస్తున్నప్పుడు క్రేజీహార్స్ తన 'వాస్తవ' ప్రపంచంలోకి జారుకున్నట్టుగా కలలు కనేవుంటాడు. నీడ లాంటి ఈ పిచ్చి ప్రపంచం తనను కబళించకుండా జాగ్రత్తపడాలి. దారిలో భుజం మీద రైఫిల్ పెట్టుకున్న గార్డు ఒకడు కనిపించాడు. ఎదురుగా ఒక బిల్డింగు కిటికీ తలుపు తెరచి వుంది. బిల్డింగ్ లోపల కాళ్లకూ, చేతులకూ ఇనుప సంకెళ్లతో మనుషులు. జంతువులను ఇలా కట్టి పడేస్తారు. తనకు కూడా ఈ శిక్ష వేస్తారా? తను జంతువా? ఒక్కసారి లంఘించాడు. లిటిల్ బిగ్‌మూన్ అతడి భుజం పట్టుకొని ఆపటానికి ప్రయత్నించాడు. కొద్ది సెకండ్ల పాటు పెనుగులాట జరిగింది. గార్డ్ కమాండర్ పెద్దగా అరిచాడు.

ఇంకా వుంది...









ముద్దు పేర్లు

ప్రతి ఒక్కరికీ ముద్దు పేరు వుంటుంది. కాదంటారా! తల్లిదండ్రులు కానివ్వండి... అమ్మమ్మ తాతయ్యలు కానివ్వండి... భార్య కానివ్వండి... భర్త కానివ్వండి... స్నేహితులు కానివ్వండి... ఎవరో ఒకరు ...ఏదో ఒక క్షణంలో ముద్దు పేరు పెట్టి పిలుస్తారు. ఆ పేరు అలా నిలిచిపోతుంది. ఈ మాట ఎంత పెద్ద ఆర్టిస్టుకైనా, దర్శకుడికైనా వర్తిస్తుంది. బాలీవుడ్‌కు చెందిన కొంతమంది ముద్దు పేర్లు ఏంటో చూద్దాం.

1.సల్మాన్ ఖాన్ - సల్లూ. 2.గుల్షన్ గ్రోవర్ - గుల్లు, 3.సుస్మితా సేన్ -టిటు, 4. రాకేష్ రోషన్ - గుడ్డు, 5.హృతిక్ రోషన్ -డుగ్గు, 6.బిపాషా బసు -బోనీ, 6(ఎ).సెలీనా జైట్లీ - చింకీ, 7.మహిమా చౌదరి-రిట్స్. 8.గోవిందా - చీచీ, 9. కరీనా - బెబో, 10. కరిష్మా- లోలో, 11. అమీర్‌ఖాన్- ఏకే, 12. షారూక్‌ఖాన్ -ఎస్ఆర్‌కె, 13. మలైకా అరోరా ఖాన్- మల్లా, 14. అమృతా అరోరా - అము, 15. అక్షయ్ కుమార్ - రాజు, 16.అజయ్ దేవగన్ - వి.డి.(ఎందుకంటే అసలు పేరు విశాల్ దేవగన్), 17.ఆమీషా పటేల్ - సన్ షైన్ / ఏంజల్-18.సునీల్ షెట్టి - అన్న, 19.సంజయ్ దత్ - సంజు/బాబా, 20.అభిషేక్ బచ్చన్- అభి, 21.అమితాబ్ బచ్చన్ -అమిత్, 22. ప్రియాంకా చోప్రా - పిగ్గీ చోప్స్. 23.మాధవన్ -మేడీ, 24.మాధురి దీక్షిత్ - బబ్లీ.







మనసా... తెలుసా?



హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

నిమిషానికో రకంగా వుంటుంది

మా పాప వయస్సు 14 సంవత్సరాలు. ఏ నిమిషాన ఎలా ఉంటుందో చెప్పలేకపోతున్నాను. ప్రతి చిన్న దానికి విసుగు, కోపం. ఈ ధోరణి ఏమిటో నాకు అర్థం కావటం లేదు. సలహా ఇవ్వగలరు?

మమత, పాలకొల్లు.

నిన్నా మొన్నటిదాకా, ఆడుతూ, పాడుతూ, అల్లరి చేస్తూ హాయిగా గడిపే పిల్లలు కాస్తా హఠాత్తుగా పెద్ద పిల్లలు అయిపోతారు. వారి శారీరక ఆకృతులలో భిన్న రకాల మార్పులు చోటు చేసుకుంటాయి. ఈడొచ్చిన పిల్లల్లో ప్రధానంగా కొట్టొచ్చినట్లు కన్పించేవి మానసిక-శారీరక మార్పులు. తల్లిదండ్రుల ప్రవర్తన ఈ వయసు పిల్లల మీద బాగా పడుతుంది. మీరు ఎంత ఆదర్శంగా ఉంటే పిల్లలు అంత చక్కని దిశలో పయనిస్తారు. ముందు మీరు పిల్లల భావనలు సరిగ్గా అర్థం చేసుకుంటున్నారో లేదో పరిశీలించుకోండి. ఇలాంటి సమయాల్లోనే పిల్లలు బయటి ప్రభావాలకు తేలికగా లొంగిపోతారు. స్నేహితులు చెప్పిందే నిజం అనే భ్రమలలో ఉంటారు. అతి నియంత్రణ, అతి గారాబం చెయ్యకండి. చెప్పిన విషయాలనే పదే పదే చెప్పొద్దు. పిల్లలు ముందు గొడవలు పెట్టుకోవద్దు. పిల్లల తప్పులను సున్నితంగా సరి చేయండి. మీ పాపతో స్నేహంగా ఉండండి. అన్ని విషయాలను మాట్లాడండి. ఏదైనా ప్రేమ పూర్వకంగా చెప్పండి. స్నేహితుల విషయంలో జాగ్రత్తగా పరిశీలించండి. వారిలో వచ్చే శారీరక, మానసిక, సామాజిక పరిస్థితులను వారికి నచ్చే రీతిలో అర్థమయ్యేలా చెప్పండి. ఎక్కడికి వెళ్ళినా అందరూ కలిసి వెళ్ళండి. మరీ విపరీత ధోరణి ఉంటే కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి.

ఏ పనీ చేయలేకపోతున్నా...

నా వయస్సు 30 సంవత్సరాలు. పిల్లలు నా మాట వినడం లేదు. వాళ్ళని బాగా కొడుతున్నాను. మూడు నెలల నుంచి ఏ పనీ చెయ్యలేకపోతున్నాను. నీరసంగా ఉంటోంది. కానీ... నాకు 16 సంవత్సరాలప్పటి నుంచి ఎవరు ఏ కార్యక్రమానికి పిలిచినా వెళ్ళి పని మొత్తం నేనే చేసే దాన్ని. అలాంటిది ఇవాళ ఇలా ఎందుకు అయ్యానో అర్థం కావడంలేదు. ఎంత మంది డాక్టర్ల దగ్గరకు వెళ్ళినా ఏమీ లేదంటున్నారు. సలహా ఇవ్వగలరు?

పావని, తిరుపతి.

జీవితమనే నాణానికి ఒక వైపు నిరాశ నిస్పృహ మరో వైపు ఆశ, చైతన్యం వుంటాయి. కొంత మంది చాలా త్వరగా నిరాశ పడిపోతారు. మీరు 16 సంవత్సరాల నుంచి ఎవరి సాయం తీసుకోకుండా రొటీన్‌గా పని చేసుకుంటు వెళ్ళడం వలన మీలో నిరాశ,



నిస్పృహలు పెరిగినాయి. దానితో కోపం పెరిగిపోయి పిల్లలను కొడుతున్నారు. పని చెయ్యలేక పోతున్నారు. మీ పిల్లలతో సామరస్యంగా స్నేహపూర్వకంగా మాట్లాడండి. మీరు చేసే పనుల పట్ల అవగాహన ఏర్పరుచుకోవడం చాలా ముఖ్యం. పుస్తక పఠనం, మంచి ఆలోచనలు, భావాలు రాసుకోవడం, అల్లిక, కుట్టు పని లేదా స్నేహితుల్ని కలుసుకోవడం చాలా వరకు మానసిక ఆందోళనను దూరం చేస్తాయి. ఆశావహ వైఖరిని ఏర్పర్చుకోండి. ఆశ జీవితానికి వెలుగు దివ్వె. కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి.

నెగటివ్‌గా మాట్లాడుతున్నాడు

మా బాబు వయస్సు మూడు సంవత్సరాలు. ఎక్కువగా నెగటివ్‌గా మాట్లాడుతున్నాడు. ఇది చూచి నాకు భయంగా ఉంది. పరిష్కారం సూచించగలరు?

శిరీష, నంద్యాల.

ప్రతి వ్యక్తి జీవితంలోనూ ఈ దశ కీలకమైనది. ఇది అభివృద్ధి చెందే దశ. పరిణత పొందేదశ. అభ్యసన దశ. విద్యా బుద్ధులను తెలుసుకునే దశ. విజ్ఞాన సముపార్జనను సాగించే దశ. దీనిని **Prime -Time development stage** అంటారు. ఈ దశలో ప్రతి వ్యక్తి తక్కువ విశ్లేషణాత్మక శక్తిని ప్రదర్శిస్తాడు. మీ కుటుంబంలో ఎవరైనా నెగటివ్‌గా మాట్లాడుతున్నారేమో గమనించండి. కొంత కాలమైనా నెగటివ్‌గా మాట్లాడే వ్యక్తులకు దూరంగా ఉంచండి. ఈ దశలో సజెషన్లను యథాతథంగా స్వీకరించే సంసిద్ధతను ఎక్కువగా కల్గి వుంటారు. పంచేంద్రియాల ద్వారా గ్రహించే ప్రతి అంశము ఒక సజెషన్‌లా అతని మెదడులో రికార్డు అవుతుంది. ఇలా రికార్డు అయిన అనేక విషయాలన్నీ ఒక చోట గుమిగూడి, వాటంతట అవే ఒకపాటగా రూపొందింపబడతాయి. ఆ పాటే మైండ్‌లో అస్తమానం రిలే అవుతూ వుంటుంది. వాతావరణం, చుట్టూ వున్న వ్యక్తుల ప్రవర్తన, వింటున్న మాటలు పిల్లలను చెడుగా గాని మంచి వ్యక్తులుగా గాని మార్చివేస్తాయి. ఇలా రికార్డు అయిన విషయం ఒక ఆచారం కావచ్చు. ఒక నమ్మకం కావచ్చు. వారిపై వారికి గల అభిప్రాయం కావచ్చు. కాబట్టి మీ బాబుకి ప్రతి విషయాన్ని తెలుసుకునేలా చేయండి. ఈ చిన్న తనంలో ఏర్పడిన భావాలే పెద్దయ్యాక వారికి తెలియకుండానే జాతి గర్వించదగ్గ వ్యక్తులుగా మార్చివేస్తాయి.

గుడ్డు పెంకులతో ఇంద్రధనస్సు

నేస్తాలూ...మీకు ఇంద్రధనస్సు తెల్సుగా. 'తెలుసా! ఏంటి? అదంటే మాకు చాలా చాలా ఇష్టం. అసలు ఎంతసేపైనా అలా చూస్తూ వుండిపోవాలనిపిస్తుంది. వీలైతే దాన్ని ఇలా పట్టుకుని ఇంట్లోకి తెచ్చి గోడమీద తగిలించాలనిపిస్తుంది' అంటున్నారు కొందరు పిడుగులు. అలాగైతే మా దగ్గర ఒక ఐడియా వుంది ఫ్రెండ్స్! చెప్పేసుకుందామా!



ఏమేం కావాలంటే...

కోడి గుడ్లు, గమ్, చార్టు.

ఎలా చేయాలంటే...

ముందు గుడ్లు సేకరించాలి. అప్పుడప్పుడు అమ్మ కోడిగుడ్లుతో కూర చేస్తుందికదా. వాటి పెంకులను పోగు చేయండి. వాటికి జాగ్రత్తగా రంగులు వేయాలి. ఇంద్రధనస్సులో ఎన్ని రంగులైతే వుంటాయో. అన్ని రంగుల గుడ్లు కావాలి మనకు. ఐతే మీరు చేయాలనుకున్న సైజును బట్టి గుడ్లను తీసుకోవాలి. ఇప్పుడు ఆ గుడ్ల డిప్పలను చిన్న చిన్న ముక్కలు చేయండి. మరీ చిన్నవైతే అతికించడం కష్టం. బొమ్మలో చూపించినంత చిన్న ముక్కలైతే బావుంటుంది. ఇప్పుడు చార్టుమీద పెన్సిల్‌తో ఇంద్రధనస్సు ఆకారం వేసుకోండి. ఒక్కో రంగు దగ్గర ఒక్కో రంగు గుడ్డు పెంకులు అతికించండి. అంతే మీకు ఎంతో ఇష్టమైన...మీరు కోరుకున్న...ఇంద్రధనస్సు రెడీ. ఇప్పుడు ఈ చార్టును ఎంచక్కా గోడకు అతికించండి. మీ ఇంటికి వచ్చిన వారి చూపంతా ఇంద్రధనస్సుమీదే నిల్చిపోకపోతే అప్పుడడగండి.



ఎక్కడున్నాయబ్బా...

ఇదిగో చిన్నారులూ...ఈ బొమ్మలో మేం చెప్పిన బొమ్మలు వెతికి సున్నా చుట్టండే. ఇంతకీ అవి ఏంటనుకుంటున్నారు? ఐస్‌క్రీమ్, మేకు, తాళం చెవి, బూటు, గరిట, తూనీగ, బ్రష్షు, టీపాట్, సుత్తి, బొమ్మ బాతు, పడవ, బాణం, జండా, రోలర్ స్కేట్, ఎలుక, కొవ్వొత్తి. ఇందులో మీరు ఎన్ని కనిపెడితే అన్ని మార్కులు వచ్చినట్టు.

ఏనుగు వుందా!

ఫ్రెండ్స్! ఈ బొమ్మలో మీకు గజరాజు కనిపించాడా! లేదా? అయితే మరింత పరిశీలనగా చూసి చెప్పండి. చెట్లలో...ఆకుల్లో...దాక్కున్నాడర్రా...ఇప్పుడు కనిపించాడా!



నీడ-బొమ్మలు

హాయ్!
పోయినవారం ఇచ్చిన నీడ బొమ్మలు బావున్నాయా! చేసి చూశారా? చేయడమే కాకుండా మీ నేస్తాలకు కూడా చూపించారా! వెరీగుడ్. మరైతే ఈ వారం మీకోసం మరిన్ని నీడ బొమ్మలు ఎదురుచూస్తున్నాయ్. అచ్చు అందులో వున్న చేతులకు మల్లే మీరూ పెట్టి చూడండి (రాత్రి పూట). ఓకేగా.



రంగులు పులిమేద్దాం

మొక్కజొన్న పాప



ఏంటి! మొక్కజొన్న పాప ఎక్కడైనా వుంటుందా? అనిపిస్తుంది చదవగానే. కానీ వుంది. అదీ మరెక్కడో కాదు. మీ ముందరే! కావాలంటే... ఎలా చేయాలో మీకూ చెప్తాం.

ఏమేం కావాలంటే... మొక్కజొన్న పొత్తు పైన పొరల్లా వుంటాయికదా. ఆ పొరలు, రెండు రంగుల ఊలు.

ఎలా చేయాలంటే... ముందు మొక్కజొన్న పొత్తు పైపొరలను జాగ్రత్తగా తీయండి. తర్వాత వాటిని పైన...కింద...కత్తిరించి సమంగా చేయండి. ఇప్పుడు అలాంటి నాలుగు పొరలను ఒక దానిమీద ఒకటి వుంచండి. బొమ్మ అనగానే తల, కాళ్లు, చేతులు రావాలి కదా. అందుకోసం... పై భాగంలో రెండు అంగుళాలు వదిలిపెట్టి... ఊలుతో కొద్దిగా లూజ్‌గా రెండు మూడు సార్లు ముడి వేయండి (1వ బొమ్మ). ఇప్పుడు తల భాగం కిందకు వచ్చేలా పట్టుకోండి. నాలుగు పొరలను సమంగా విడగొట్టండి. రెండు పొరలు ముందుకు, రెండు పొరలు వెనక్కి వచ్చేలా కిందికి వంచండి (2వ బొమ్మ). ఇప్పుడు మరలా రెండు అంగుళాల కింద ఊలుతో రెండు సార్లు ముడి వేయండి (3వ బొమ్మ). ఇప్పుడు వేరొక మొక్కజొన్న పొరను తీసుకొని సన్నగా కత్తిరించండి. ఇదెందుకు అంటారా! చేతులకోసం. బొమ్మ పొడవుకు తగినట్టుగా వుండాలి కదా. చేతులు కత్తిరించాక ... దీన్ని ... ఇందాక బొమ్మ తల దగ్గర ముడి వేశాంగా. అక్కడ వుంచి... క్రాస్‌గా ఊలుతో ముడి వేయండి (4వ బొమ్మ). అంతే దాదాపు బొమ్మ ఆకారం కనిపిస్తుంది. ఇప్పుడు చేతులకు చివరన కూడా ఊలుతో ముడి వేయండి (4వ బొమ్మలోలా). ఇంక వెంట్రుకల సంగతి చూద్దాం... నలుపు ఊలు తీసుకొని తల పై భాగంలో సూదితో అమర్చండి. పాప బొమ్మ కదా. పొడవు వెంట్రుకలైతే చూడముచ్చటగా వుంటుంది. అదే అబ్బాయి బొమ్మకైతే పొట్టి వెంట్రుకలు కనిపించేలా ఊలు ఏర్పాటు చేయాలి. ఇంక చివరిగా కళ్లు, ముక్కు, నోరు స్థానంలో కూడా ఊలుతో కుట్టొచ్చు. అంతా అయ్యాక ఈ బొమ్మలను ఎంచక్కా ఒక చక్కటి క్లాత్ మీద నిలబెడితే ఎంత ముచ్చటగా వుంటాయో. చూడ్డానికి రెండు కళ్లూ చాలవనుకోండి. ఇంక అద్దాల అల్మారా వుంటే ... ఇంకా అదిరిపోతుంది. దుమ్ము పడదుకదా. చాన్నాళ్లు పాడవకుండా ...బాగుంటాయి. మరి చేసెయ్యండి ఆలస్యమెందుకు?

-చూటీ

డా॥ జె.పి. వైద్య



ఆసిఫ్,
కమల్ అమ్రోహీ, రాజ్‌కపూర్ లాంటి
వాళ్ళు ఏళ్ళ తరబడి లాగీ లాగీ పీక్కుతినే
టీవీ సిరియల్లా- సంవత్సరాల తరబడి
ఓపిగ్గా ఒకే సినిమాకు పురుడు
పోసేవాళ్ళు, మనం అంతకన్నా
ఓపిగ్గా వేచి చూసి, 'ఆహా!' 'ఓహో!' అంటూ
మెచ్చుకొని, తరించిన వాళ్ళమే కదా!

బహుశా మనలాంటి సినిమా పిచ్చోళ్ళ కోసమే ఆ మహనీయులు అంతటి ఓపికతో, అంతటి గొప్ప సినిమాలు తీసి ఉండొచ్చు కాబోలు.

-'అరేcc ఔగనీ....! భైసాబ్! ముందు గీ సిన్మాలు తీసి మన దిమాగ్‌లు ఖరాబ్ చేసినోడు ఓడు భైసాబ్!?' అనే మొండి ప్రశ్న ఎందరి మెదళ్ళలో వచ్చిందనీ?

ఆ వివరాలేంటో చూద్దాం....



భారతీయ చలనచిత్ర ఆదిగురువు

ఫాల్కే!

చరిత్ర పుటల్లో ఎన్నో అందాలూ, అద్భుతాలూ దాగి వున్నాయి. కొంత మంది జీవితం ముగిశాక చరిత్రలో నిలిచిపోతారు. కొంత మంది వద్దన్నా జ్ఞాపకం వస్తూ ఉంటారు. అదో గమ్మత్తు చరిత్ర. ఈ పూట మా 'మిలియన్ డాలర్ల ప్రశ్న 'ఏమిటంటే...

'కొన్ని వింతల్నీ, విశేషాల్నీ విడ్డూరాలనూ మనం ప్రతినిత్యం చూస్తున్నా, ఆనందిస్తున్నా, అనుభవిస్తున్నా ఆ సదరు 'ఆవిష్కర్త'ను తలచుకుంటున్నామా!' అన్నది.

అక్షరాలా దాదాపు నలభై ఐదు లక్షల రూపాయల విలువైన ప్రశ్న ఇది. సినీ ప్రేక్షకులుగా, ఫిల్మ్ దీవానాలుగా ఎంత మంది అలాంటి మహనీయులను జ్ఞాపకం చేసుకుంటున్నాము? తలచుకుంటున్నాము?

48 డిగ్రీల గ్రీష్మ తాపాన్ని సైతం 'పండు వెన్నెల్లా' భావించి మనం మండు టెండల్లో 'లాహిరి లాహిరి'లో అని గున్‌గునాయించుకుంటూ,ఝూమ్మని ఫస్ట్‌డే, ఫస్ట్ షో సినిమా కోసం ఎన్ని ముష్టిఘాతాలను తట్టుకోవటం లేదనీ! వడ దెబ్బల భయం కూడా లేకుండా, చొక్కాలు చింపుకొనైనా సరే, చేతులో కాళ్ళో పణంగా పెట్టైనా 'టికెట్టు' సాధిస్తాం. ఎంత కంపు అవక తవక కంగాళీ మహా దరిద్రపు సినిమానైనా, కళ్ళార్పకుండా చూసి తరించి పోమనీ? కనీసం- 'సినిమా' అంటే అంతటి 'చిక్కటి పిచ్చి' ఉన్న మనలో ఎంత మంది సినిమా మాయల దునియా 'చిత్ర పితామహుడి' గురించి ఆర్తిగా ఆలోచిస్తున్నామన్నది ఈ పూట మా ప్రశ్న!

ప్రతి సంవత్సరం కోట్లకొద్దీ రూపాయలు సినిమా ఇండస్ట్రీలో పెట్టుబడి రూపంగా కైంకర్యమవుతూ ఉంటాయి. వందల కొద్దీ సినిమాలు రూపు దిద్దుకుంటూ వెండి తెరను ఆక్రమించుకుంటాయి. కొన్ని రీళ్ళ రూపంగా 'అసంతృప్తి ఆత్మల్లా'- 'డబ్బా'ల్లోనే మురుగుతుంటాయి. కొన్ని కారణాంతరాలతో అర్ధాంతరంగానే మూలుగు తుంటాయి. కొన్ని చావుదెబ్బతిని, కళ్ళు లొట్టపోయినట్టు ఎక్కడో 'మార్నింగ్ షో'లు మాత్రమే అంటూ వచ్చినట్టే వచ్చి మాయమై పోతాయి. ఎప్పుడో పాతిక సంవత్సరాల క్రితం నిర్మాణానికి నడుం కట్టిన సినిమా ఈ మధ్యే తెర దాకా వచ్చింది. అదీ మన అందాల ఎవర్‌గ్రీన్ స్టార్ 'నాగేస్రరావ్' గారిదే!

ఆసిఫ్, కమల్ అమ్రోహీ, రాజ్‌కపూర్ లాంటి వాళ్ళు ఏళ్ళ తరబడి లాగీ లాగీ పీక్కుతినే టీవీ సిరియల్లా- సంవత్సరాల తరబడి ఓపిగ్గా ఒకే సినిమాకు పురుడు పోసేవాళ్ళు, మనం అంతకన్నా ఓపిగ్గా వేచి చూసి, 'ఆహా!' 'ఓహో!' అంటూ మెచ్చుకొని, తరించిన వాళ్ళమే కదా!

బహుశా మనలాంటి సినిమా పిచ్చోళ్ళ కోసమే ఆ మహనీయులు అంతటి ఓపికతో, అంతటి గొప్ప సినిమాలు తీసి ఉండొచ్చు కాబోలు.

-'అరేcc ఔగనీ....! భైసాబ్! ముందు గీ సిన్మాలు తీసి మన దిమాగ్‌లు ఖరాబ్ చేసినోడు ఓడు భైసాబ్!?' అనే మొండి ప్రశ్న ఎందరి మెదళ్ళలో వచ్చిందనీ?

ప్రపంచంలోనే మొట్ట మొదటి సినిమా తీసిందెవరు?

ప్రపంచ సినీ చరిత్రలో తొలి సినిమా నిర్మాతల 'లూయీ లుమియర్, ఆగస్ట్ లుమియర్' అనే సోదరులు. అది 1895 నాటి చరిత్ర, పారిస్‌లోని ఒక హోటల్లో ఉండుండి సినిమాటోగ్రాఫ్ ప్రదర్శన జరిగి, అంత వరకు నిశ్చలంగా ఉన్న బొమ్మలు తటాలున కదిలేసరికి జనం షాకై పోయారు. పిచ్చి పిచ్చిగా ఇంతింత కళ్ళు చేసుకొని చూసి, తేరుకొని, చేతులు, నొప్పిలేచేట్టు చప్పట్లు కొట్టి, మరీ ఆనందించారు.

1903లో ప్రపంచంలో తొలి మూకీ కథ చిత్రంగా 'ఎడ్విన్

పోర్టర్' అనే నిర్మాత కదిలే బొమ్మలకు ఒక కథ అల్లి 'ది గ్రేట్ ట్రెయిన్ రాబరీ' అనే చిత్రాన్ని సృష్టించాడు.

అప్పటి నుండి నేటి దాకా సినిమాలు మనలాంటి వేల లక్షల దీవానాగాళ్లను 'రాబరీ' చేస్తూనే ఉన్నాయి.

ఇక మన భారతదేశంలో సినిమా మాయ దూసుకొచ్చిన చందం తలచుకుందాం.

బొంబాయిలోని 'వాట్సన్ హోటల్'లో మొట్ట మొదటి సారిగా 'లూమియర్ బ్రదర్స్' నిర్మించిన సజీవ సినిమాట్రోగ్రాఫ్ చిత్రాలు 'ఎంట్రీ ఆఫ్ సినిమాటోగ్రాఫ్', 'అరైవల్ ఆఫ్ ది ట్రెయిన్' ప్రదర్శింప బడ్డాయి.



ఫాల్కే అవార్డు అందుకున్న ఆనంద క్షణాల్లో... భార్యతో యష్‌చోప్రా...

అది చూసిన మన వాళ్ళు తెగ ఆశ్చర్యపడిపోయి 'పాగల్' అయి పోయారంటే అతిశయోక్తి ఎలా అవుతుందనీ?

అది 1896 జూలై 7 నాటి ముచ్చట.

బొంబాయిలో సాగినట్టే ఆ చిత్రాల ప్రదర్శనే అలనాటి కలకత్తాలోనూ సాగింది. అక్కడా జనాలకు పిచ్చి లేచినట్టైంది.

అది చాలా మందిని కదిలించింది. కాని, మహారాష్ట్రలోని 'నాసిక్'కు చెందిన 'దాదా సాహెబ్ ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే'ను మాత్రం ఒక జాఢ్యంలా పట్టి పీడించింది.

మరి మన దేశం సంగతేంటి?

ఆఖరకు ఆయన పట్టుదల, తపన, కఠోర పరిశ్రమ, ఆఖర్న ఆయనను భారదేశపు తొలి చిత్ర నిర్మాతగా చరిత్ర సృష్టించేలా చేసింది. ఇప్పుడు సినీ పరిశ్రమలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి ఆయన జ్ఞాపకార్థం ఏటా ఇచ్చే అత్యున్నతమైన 'దాదా సాహెబ్ ఫాల్కే ఆవార్డ్' అలనాటి నాసిక్ అబ్బాయిని చరిత్రలో గర్వంగా నిలబెట్టింది.

మన దేశ సినీ చరిత్రకే గర్వకారణం అయిన 'దాదా సాహెబ్' గురించి కాసేపు ముచ్చటించుకుందాం రండి.

ఎవరీ ఫాల్కే? ఎచటి వాడు?

గోదావరి నది ఉగమస్థానం మహారాష్ట్రలోని 'నాసిక్'లోని 'త్రింబకేశ్వర్'. ఆ పుణ్య నగరిలో నేటికి 138 సంవత్సరాల క్రితం అంటే 30 ఏప్రిల్ 1870 నాడు జన్మించాడు 'ధుండిరాజ్'. పూర్తి పేరు 'ధుండి రాజ్ గోవింద్ ఫాల్కే'. తండ్రి సంస్కృత పండితుడు. మన ధుండి రాజ్‌గురు భాషా శాస్త్రాల జోలికి పోకుండా హాయిగా ముంబాయిలోని జె.జె.ఇ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ త్రోవ పట్టుకున్నాడు. 1885-90 దాకా కళల మధ్య, చిత్రాల మధ్య, రంగుల దునియాలో గడిపిన 'ధుండిరాజ్'కు శిల్పకళ అన్నా, డ్రాయింగ్ అన్నా ఫొటోగ్రఫీ అన్నా మక్కువ ఎక్కువ.

కాలక్రమేణా పురావస్తుశాఖలో డ్రాఫ్ట్స్‌మన్‌గానూ, ఫోటోగ్రాఫర్ గానూ పని చేశాడు. కళాభవన్ అని ఒకటుండేది. దానికి అధిపతిగా ఉండేవారు ప్రొఫెసర్ టి.కే. గజ్జర్ అనే ఓ పెద్దమనిషి. ఆయన జర్మనీ నుండి ఒక కెమెరాను తెప్పించుకున్నారు. అదంటే ఎంతో మక్కువ మన ధుండిరాజ్‌కు. అది 1890-96 ప్రాంతం రోజులు. ఆ తర్వాత గజ్జర్ గారు బొంబాయి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా వెళ్ళిపోయాడు. మన 'ధుండిరాజ్' గారేమో హాయిగా 'గోధ్రా'కు ప్రయాణం కట్టేశారు. అక్కడే 'పోర్ట్రెట్ ఫొటోగ్రఫీ' వృత్తిగా ప్రారంభించారు. భార్య మరణం వల్ల బరోడా ప్రాంతం వదిలేసి మహారాష్ట్రలోని 'పూణే' చేరుకున్నారు. మనస్సులో ఎక్కడో ఫొటోగ్రఫీ మక్కువ ఇంకా ఉధృతం కాసాగింది. మధ్యలో రకరకాల పనులు చెయ్యాల్సి వచ్చింది.



కొన్నాళ్ళు మేకప్‌మాన్‌గా.... మరి కొన్నాళ్ళు జర్మన్ ఇల్యూజనిస్ట్‌కు అసిస్టెంట్‌గా మరికొన్నాళ్ళు మెజీషియన్‌గా...!

కొందరు శ్రేయోభిలాషులు 'ప్రింటింగ్ ప్రెస్'లో 'కళల విభాగం' చూసుకోండి అని ప్రోత్సహించారు. 'మాతోనే ఉంటానంటే జర్మనీ కూడా పంపిస్తాం' అన్నారు. జర్మనీ యాత్ర చేశాక 'ధుండిరాజ్'కు 'ప్రింటింగ్ కెరియర్' అంతగా రుచించలేదు. మనస్సులోని 'ఫొటోగ్రఫీ స్వప్నాలు' ఉక్కిరి బిక్కిరి చేయసాగాయి.

'సర్లే! ఏదైతే అదే అవుతుందిలే....' అన్న మొండి వాదంతో తిప్పలు పడి ఇంగ్లండ్ ప్రయాణం పెట్టుకొన్నా 'సినిమా నిర్మాణం' గురించి ఇంకా ఎక్కువగా తెలుసుకునే ప్రయత్నాలు చేశాడు.

1912లో తిరిగి వచ్చాడు.

తొలి చిత్రం 'రాజా హరిశ్చంద్ర'

రాజా రవివర్మ లాంటి అద్భుత కళాకారుల భారతీయ సంస్కృతి తైల చిత్రాలు అందరినీ అలరించేవి. నేటికీ అవి ఎందరినో ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నాయి. తన మౌలిక సిద్ధాంతాలూ, సత్యవాక్పరిపాలన ఎడల, అనురక్తి గల రాజా హరిశ్చంద్రుడి గుణ స్వభావాలంటే ఎంతో మోజు పడి 'రాజాహరిశ్చంద్ర కథ' నే చలన చిత్రంగా మలిచాడు.

1913-మే 3న ఫాల్కే మొదటి చిత్రం 'రాజా హరిశ్చంద్ర' విడుదలైంది. ప్రపంచంలో తొలిసారి కదిలే బొమ్మల సినిమా ప్రపంచం మొదలైన 17 సంవత్సరాలకు తొలి భారతీయ సినిమా ప్రాణం పోసుకొని నిలిచింది. మన పెద్దోళ్ళు, పూర్వజులు 'సినిమా'యలో పడిపోయారు. మనం ఇంకా చిత్రవిచిత్ర పద్ధతుల్లో నీరాజనాలు పలుకుతున్నాం.

బ్రిటిష్ పాలకులు రాజధానిని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చిన రోజులు అవి. రాజా హరిశ్చంద్ర కన్నా ముందు 1912లో ఆర్.జి. టోర్నీ 'పుండలిక్' అనే చిత్రం నిర్మించాడని పేర్కొంటారు. కాని, పూర్తి స్థాయిలో నిర్మించబడ్డ చిత్రంగా క్రెడిట్ పొందింది 'రాజా హరిశ్చంద్ర' మాత్రమే. దాని నిడివి నాలుగు రీళ్ళు రమారమి 3000 అడుగులు. ఈ రోజుల్లో తిక్కవేషపు చెత్త డాన్సుల కత్తిరింపు కూడా ఎక్కువే ఉండి ఉంటుందనుకోండి. కాని అలనాటి ఆ మూడువేల అడుగుల చిత్రం బొంబాయిలోని 'కారొనేషన్ సినిమా'లో చరిత్ర రాసి పారేసింది. ఆనాటి నుంచి నేటిదాకా జనం పిచ్చి పిచ్చిగా కదం తొక్కడం కేవలం 'సినిమా'ల కోసమే అనేలా చేసింది.

అప్పటినుంచే జోరందుకుంది

ఆ తర్వాత ఫాల్కే చిత్ర నిర్మాణం జోరుగా సాగింది. జనం బ్రహ్మరథం పట్టారు. తలమీద పెట్టుకొని ఊరేగారు.

మోహినీ భస్మాసుర (1913)

సత్యవాన్ సావిత్రి (1914)

కొన్ని డాక్యుమెంటరీస్ లాంటి సినిమాలు తీశారు.

నాసిక్ త్రింబకేశ్వర్ ఏ థిల్ దేఖావే (నాసిక్ త్రింబకేశ్వర్‌లోని అందాలు) 'సీన్స్ ఆఫ్ రివర్ గోదావరీ', - 'గ్లాస్ ఫ్యాక్టరీ ఆఫ్ తాలేగాంవ్'' - 'కార్తీక్ పూర్ణిమా ఉత్సవ్' (1916), ధూమ్రపాన్ లీలా(16), లంకా దహన్ (17), 'హౌ ఫిల్మ్స్ ఆర్ మేడ్' (17), శ్రీ కృష్ణ జన్మ (18), కాలియా మర్దన్(19)- '37- గయా కాంగ్రెస్ సెషన్' (1923)-'అశ్వద్ధామ(23), బబ్రువాహన (23), వచన్‌భంగ్ (25) ఏకంగా పది చిత్రాలూ+ డాక్యుమెంటరీలు! 'చతుర్థీచా చంద్ర'-'ఎల్లోరా కేవ్స్'-'గణేష్ ఉత్సవ్' - 'హిడింబ్ బస్మాసుర్ వధ్'-'కాకా సాహెబ్ ఔట్ విట్టెడ్' - 'ఖంద్యాబ్యాచా ఘూట్'-'ఖోడ్ మోడ్‌లీ'-'సత్యభామా'-'శమంతక్ మణి'...

1926లో ఆరు సినిమాలు. అందులో హిందీ

టైటిల్స్‌తో 'భక్త ప్రహ్లాద' 1927లో మరో ఆరు. 'భక్త దామాజీ'-'ద్రౌపదీ వస్త్రాపహరణం'- 'నలదమయంతీ' - 'చిత్రాంగదా మోహినీ' లాంటివి.

1928లో 'భక్త దామాజీ' - 'పరశురామ్' లాంటి చిత్రాలను నిర్మిస్తే 1929లో 'బోల్‌కీ తపేలీ' (టాకింగ్ పాట్) లాంటి చిత్రాలు రూపుదిద్దుకున్నాయి.

చాంతాడంత ఉన్న లిస్ట్‌లోంచి కొన్నైనా ఏరుకొని అందించాలి కదా! అవ్వన్నీ నేటి కంప్యూటర్ యుగం టెక్నాలజీ ముందు వెలవెల పోవచ్చేమో కాని, చలన చిత్ర చరిత్రలో 'వెల కట్టలేనివి అనే సత్యాన్ని మనం మరచిపోకూడదు. వాటి ఆంటిక్ వాల్యూ అనంతమైంది. 'చంద్రహాస' - 'కచదేవయానీ' -'మాలతీ మాధవ్' - 'మాలవికాగ్ని మిత్ర' - 'సంత్ మిరాబాయి'-'వసంతసేన' -'భక్త దామాజీ'.

- మన విఠలాచార్య గారివి 'కత్తి యుద్ధాల మాయల చిత్రాలు'. నందమూరి గారివి 'అద్భుతమైన పౌరాణికాలు'. ఏయన్‌ఆర్ గారివి 'మరచి పోలేని అందమైన సాంఘికాలు'. అలాగే-

అలనాటి సినీ ఆది శంకరుడిలాంటి 'ఫాల్కేగారివి' హిందూ పురాణగాథలూ, భారతీయ సంస్కృతికి గట్టి పునాదుల్లా నిలిచిన పాత్రల చిత్రాలు, అక్కడక్కడా అలనాటి వింతలూ, విశేషాలు డాక్యుమెంటరీల్లాంటి అపురూప చిత్రాలు.

అలనాటి హైదరాబాద్ లోని చార్‌మినార్, ఆబిడ్స్, హుస్సేన్ సాగర్ చిత్రాలు (శ్వేతశ్యామ వర్ణాలవే కానీండి) చూసి మనం కళ్ళింతింత పెద్దవి చేస్తూ 'అబ్బా'... 'అవ్వా...!' 'అయ్యారేఁ' అనుకున్నంత అపురూపాలు ఆయన అలనాటి చిత్ర సృష్టి.

1937 నాటికి గంగావతరణం (ఇంగ్లీష్ టైటిల్-ది డిసెంట్ ఆఫ్ గంగా) లాంటి చిత్రాలు రాజారవివర్మలాంటి అద్భుత రంగుల మేళవాల జాదూలా అవతరించాయి.

సినిమా సృష్టి ఒక మాయాజాలం

ఒకప్పుడు సినిమాల్లో హీరోహీరోయిన్‌లు ఆమడ దూరం నిలుచుండి, కదలకుండా పాటలు పడినా జనం వెర్రిగా కదిలి పోయేవారు. హీరో హీరోయిన్‌లు అంటీ అంటనట్టు చేతులు తాకించుకుంటే జనాలకు గంగ వెర్రులు పుట్టేవి.

కాలం మారింది

ఇప్పుడు మూడు నిమిషాల పాటలో ముప్పై డ్రెస్సులు... మూడొందల సీన్లు... మూడు వేల అర్థం పర్థం లేని జర్కులూ... ఝట్కాలూ... ! మెడలు రిక్కించి, పొజిషన్‌లు మార్చి మనం కూడా ఒళ్ళు నొప్పులు తెచ్చుకుంటున్నాం. ఈనాటి సినిమాలు చూసి, ఆఖరి రోజుల్లో తెరమరుగై నిరుపేదగా తనువు చాలించిన 'దాదా సాహెబ్ ఫాల్కే' నేడు ప్రతి ఏటా విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. ఈ తరం సినిమాకు సినీ నిర్మాణ ప్రక్రియలకు 'కొలత బద్ద'లా నిలిచి పోయాడు. చరిత్ర సృష్టించాడు. సినీ చరిత్రలో భాగమైపోయాడు. సినీ నీలాకాశంలో చంద్రుడిలా వెలిగి పోతున్నాడు. మనం మాత్రం తక్కువా? చప్పట్లు కొడ్తూ కేరింతలేస్తూ 'బాగున్నదీ'-'ఛీ- బాగాలేదోయ్'-'ఓహ్! గ్రేట్ !!'-'థూ....! కంపు! చండాలం' అనే వెండి తెర ముందు 'నేల టికెట్టు' గాళ్ళం మనమే కదా? ఆర్ వుయ్ నాట్ క్రియేటింగ్ హిస్టరీ??

ఫాల్కే పేరిట కేంద్ర ప్రభుత్వం చలన చిత్ర రంగానికి విశిష్ట సేవలు చేసిన కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ప్రతి సంవత్సరం అవార్డులను ఇస్తుంది! కింద కూర్చుండి, చేతులు నొప్పి పెట్టేలా చప్పట్లు కొట్టే మనలాంటి 'సినిమా పిచ్చోళ్ళకు' ఏం దొరికిందనీ? ఆధైర్యపడొద్దు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలాంటి వాళ్ళం మనం.... వుయ్ టూ ఆర్ గ్రేట్!!



ఫాల్కే

❋

ఫాల్కే అవార్డు గ్రహీతలు

దేవికా రాణి (నటి, ఆంధ్రప్రదేశ్), బి.ఎన్ సిర్కార్ (నిర్మాత, పశ్చిమ బెంగాల్), పృథ్వీరాజ్ కపూర్ (నటుడు, పంజాబ్), పంకజ్ మల్లిక్ (సంగీత దర్శకుడు, పశ్చిమ బెంగాల్), రూబీ (నటి, మహారాష్ట్ర), బి.నరసింహారెడ్డి (దర్శకుడు, ఆంధ్రప్రదేశ్), ధీరేంద్ర నాథ్ గంగూలీ (నటుడు, దర్శకుడు, పశ్చిమ బెంగాల్), కానన్ దేవి (నటి, పశ్చిమబెంగాల్), నితిన్ బోస్ (సినిమాటోగ్రాఫర్, దర్శకుడు, రచయిత, పశ్చిమబెంగాల్), రాయ్ చాంద్ బొరాల్ (దర్శకుడు, స్వరకర్త, పశ్చిమబెంగాల్), షొరబ్ మోడి (నటుడు, దర్శకుడు, నిర్మాత -మహారాష్ట్ర), పైడి జైరాజ్ (నటుడు, దర్శకుడు-ఆంధ్రప్రదేశ్), నౌషాద్ అలీ (సంగీత దర్శకుడు-ఉత్తర ప్రదేశ్), ఎల్వీ ప్రసాద్ (నటుడు, దర్శకనిర్మాత-ఆంధ్రప్రదేశ్), దుర్గా ఖోటె (నటి, మహారాష్ట్ర), సత్యజిత్ రే (దర్శకుడు -పశ్చిమబెంగాల్), వి.శాంతారామ్ (నటుడు, దర్శకనిర్మాత-మహారాష్ట్ర), బి.నాగిరెడ్డి (నిర్మాత -ఆంధ్రప్రదేశ్), రాజ్‌కపూర్ (నటుడు, దర్శకుడు-పంజాబ్), అశోక్ కుమార్ (నటుడు -పశ్చిమబెంగాల్), లతా మంగేష్కర్ (గాయని, మహారాష్ట్ర), అక్కినేని నాగేశ్వరరావు (నటుడు, ఆంధ్రప్రదేశ్), భల్జీ పెంధార్కర్ (దర్శకనిర్మాత, రచయిత -మహారాష్ట్ర), భూపేన్ హజారికా (సంగీత దర్శకుడు-అస్సాం), మజ్రూ సుల్తాన్‌పురి (గేయ రచయిత), దిలీప్ కుమార్ (నటుడు, పెషావర్), డాక్టర్ రాజ్‌కుమార్ (నటుడు, కర్నాటక), శివాజీ గణేశన్ (నటుడు -తమిళనాడు), ప్రదీప్ (గేయరచయిత), బి.ఆర్ చోప్రా (దర్శకనిర్మాత -పంజాబ్), హృషికేశ్ ముఖర్జీ (దర్శకుడు -పశ్చిమబెంగాల్), ఆశాభోంస్లే (గాయని, మహారాష్ట్ర), యశ్ చోప్రా (దర్శకనిర్మాత -పంజాబ్), దేవానంద్ (నటుడు, దర్శకనిర్మాత-పంజాబ్), మృణాల్ సేన్ (దర్శకుడు -పశ్చిమబెంగాల్), ఆదూర్ గోపాలకృష్ణన్ (దర్శకుడు-కేరళ), శ్యామ్ బెనెగల్ (దర్శకుడు-ఆంధ్రప్రదేశ్, కర్నాటక).

దేవానంద్

రాజ్‌కపూర్

దేవికారాణి

లతామంగేష్కర్

అక్కినేని



ఎల్వీ ప్రసాద్



గుడ్ల మీద నడుస్తూ... కారు లాగగలరా!

కోడిగుడ్డు సంగతి మనకు తెలియనిదేముంది చెప్పండి. కాస్త గట్టిగా కొడితే 'ఫట్'మని పగిలిపోయి బొళక్కున సొన కారుతుంది. అలాంటి గుడ్డు మీద ఎవరైనా నడవగలరా! అదీ పగలకుండా!! పైగా ఇలా గుడ్ల మీద నడుస్తూ చెవులతో కారుని లాగగలరా!!!

ఏంటిది తమాషానా? మనమేమైనా చీమలమా! అదేమైనా బొమ్మ కారా? అనుకుంటున్నారు కొందరు మనసుల్లో.

మీరు లాగలేరు సరే. కానీ ఆ పని చెయ్యగల మొనగాడు ఒకడున్నాడంటే నమ్ముతారా? అదీ కాదా! ఎలాగండీ ఇలాగైతే. బొమ్మ చూడండి. ఇతను చైనా వాసి. డెహూయ్‌లో ఈమధ్యే ఈ ఫీట్ చేశాడు. జనాలు విరగబడి చూశారు.

మరో తమాషా విషయం చెప్పమంటారా! ఇతను ఈ ఫీట్‌ని తనకు 8 సంవత్సరాల వయసప్పటినుంచి నేర్చుకుంటున్నాడు.

దీనికే ఇంతలా ఆశ్చర్యపోతే ఎలా? కొంత మంది చైనీయులు కోడి గుడ్ల మీద నిలబడి నోటితో పాతిక కేజీల సైకిల్‌ని ఎత్తుతారు తెల్సా! అదీ గుడ్లు పగలకుండా...!!

కె. సాహిల్

విశ్వాసానికి మారు పేరు

కుక్కలకు బాగా పసిపిల్లలు కనిపిస్తే ఏం చేస్తాయి? లొట్టలేసుకుంటూ నోటకరుచుకుని తీసుకెళ్లి...కొరికి చంపేస్తాయి. కానీ కెన్యాలో దీనికి పూర్తి విరుద్ధంగా జరిగింది.

అది అటవీ ప్రాంతం. అక్కడ ఒక కుక్కకు... పదిహేను రోజుల పాప కనిపించింది. మురికి బట్టలో చుట్టిన ఆ పాపను నోట కరుచుని చాలా దూరం నడిచి...నడిచి ... మెయిన్ రోడ్ దాటుకుని తన నివాసం దగ్గరకు తీసుకెళ్లింది. తన కుక్కపిల్లల పక్కన పాపను వుంచింది. అంతటితో ఆగలేదది. అటు నుంచి వెళ్లే వాళ్లు పాపను చూసి చేరదీసే వరకు కాపలా కాసింది.

ఈ విషయం తెలుసుకున్న కుక్క యజమాని పాపను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించాడు. అక్కడ వైద్యులు పాపను శుభ్రంచేసి చికిత్స చేశారు. పైగా వారేం చెప్పారో తెల్సా! "ఈ పాప కనీసం రెండు రోజుల పాటు అలా అడవిలో మంచులోనే పడి వుంది. ఆ కారణంగా పాపకు శ్వాసకు సంబంధించిన చిన్నచిన్న సమస్యలు తలెత్తాయి. దానికి చికిత్స చేస్తే సరిపోతుంది" అని. అందుకే అన్నారు కుక్కకు విశ్వాసం ఎక్కువని. మనిషికి నేస్తమని.

ఇలా కర్ర తిప్పగలరా?

ఈ ఎలుగు పేరు క్లాడ్. జపాన్‌లోని హిరోషిమా జూలో వుంటుంది. ఇక్కడికి ఇది సరిగ్గా ఆరేళ్ల క్రితం వచ్చింది. అప్పటి నుంచి అది చిన్న చిన్న కొమ్మలను పైకి ఎత్తి అలా తిప్పుతుండేది. ఈ విషయాన్ని గమనించిన జూ సిబ్బంది... దానికి ఒక చిన్నసైజు దుంగను ఇచ్చి తిప్పడం నేర్పారు. అంతే గంటల తరబడి అలా ఆ ఐదు కేజీల దుంగను తిప్పుతూనే వుంటుంది. కర్రసాము చేసినట్టే దుంగను తిప్పే ఎలుగును చూడ్డానికి జనాలు ఎగబడసాగారు.

దీనికి ఇదేం సరదా అనుకుంటున్నారా! అదేనండీ మరీ... జిహ్వాకో రుచి అంటే...!

కౌశితం ప్రశ్న

డా॥ నాగినేని భాస్కరరావు

"ఇదేం కంపమ్మా! నీ తమ్ముడు సరిగ్గా వుంటే ఎంతైనా సహాయం చయవచ్చు. నీకు, నీ ఆయనకూ... రాను రాను భవిష్యత్తులో ఇతని వల్ల ఎన్నో కష్టాలు వస్తాయి. నీ ఇష్టం, నీభర్త ఇష్టం" అన్నారు. శంకరం ఇవన్నీ గమనిస్తూనే ఉన్నాడు. కాని అతనికి కళలముందు తన అత్తగారు బాబూ! నాకు దిక్కెవరూ లేరు. అల్లుడినైనా కొడుకువైనా నీవే. మిగతా ఆడపిల్లలు, వాళ్ళ భర్తలు పట్టించుకోరు. నీవే నీ భావమరదిని అదుకోమంటూ చేతులెత్తి నమస్కరించటం కళ్లముందు కదలాడుతూ వుండటం- అతణ్ణి కట్టిపడేస్తున్నది.

లెక్చరర్ పోస్ట్ వచ్చాకే భవానీని పెళ్లాడాడు శంకరం. ఇద్దరు పిల్లలు. బాబు, పాప. మెల్లగా పి.హెచ్‌డి చేశాడు. భవానీ ఓపెన్ యూనివర్శిటీలో బి.ఎ. పాసైంది. బావమరిది బాబూరావు అక్క భవానీ వద్దకు వచ్చి నెల రెండు నెలలుండి వెళుతుంటాడు. అతను కాస్త జాలీ టైపు. నిష్టాగరిష్ఠుడైన బావంటే అతనికి కాస్త చులకన. కాకపోతే అది పైకి అనేవాడుకాదు.

❖ ❖ ❖

వయసు పైబడడంతో తండ్రి రాఘవయ్య వ్యాపారం బాబూరావు చూడాల్సి వచ్చింది. చదువుకు స్వస్తి చెప్పాడు. ఆ వ్యాపారాన్ని మూడు బాటిల్స్, ఆరుగురు వనితలూ - చందాన అరగదీశాడు. పెళ్ళికి పిల్లను ఇచ్చేవాళ్లు లేరు. రాఘవయ్య కొడుకు మనాదితో కన్నుమూశాడు. ఆ తరువాత బాబూరావుకు అసలు ఎదురే లేకుండా పోయింది. తమ్ముడు అలా తయారవటం భవానీకి ఆందోళన కలిగిస్తోంది. అందుకే తన వద్దకు వచ్చినప్పుడు కోప్పడుతుంది. శంకరాన్ని బతిమాలి తమ్ముణ్ణి తన వద్ద కొద్ది రోజులు వుంచుకొంటుంది. కాని బాబూరావు ప్రవర్తనలో మార్పు లేదు. పైగా మరో తంటా తెస్తాడు. ఇంట్లో పనిమనుషుల వెంట పడ్డాడు. వాళ్ళు గొడవ చేయటం- వాళ్ళను సముదాయించి, శాంతింపజేసి భారీ మూల్యం చెల్లించుకోవటం శంకరం వంతైంది.

పెరుగుతున్న తన పిల్లలిద్దరు ఎక్కడ చెడిపోతారోనన్న భయం పట్టుకుంది శంకరానికి. "భవానీ! మీ తమ్ముడిని మన ఇంటికి రావద్దని చెప్పలేవూ? అంత కాకపోతే నేనే మరో రెండు గంటలు పార్ట్ టైమ్ జాబ్ చేసి అతనికి నెల నెలా కొంత డబ్బు ఇస్తాను" అన్నాడు శంకరం. "నేను వాణ్ణి సరిగ్గా వుండరా. చెడు అలవాట్లు మాను" అని చెప్తున్నాను. వాడు వినటం లేదు. తాగుడు మానలేక పోతున్నాడు" అంది భవానీ. 'సరే అయితే ఇతణ్ణి డి అడిక్షన్ సెంటరులో కొద్ది రోజులుంచుతాను" అని శంకరం ఆ సెంటర్ల వివరాలు సేకరించి నెలకు ఐదు వేల రూపాయల చొప్పున ఒక 'డి అడిక్షన్' సెంటర్‌లో చేర్పించాడు. అక్కడి నుండి బాబూరావు నాలుగు రోజుల తరువాత తప్పించుకున్నాడు. వాళ్ళు శంకరానికి కబురు చేశారు. వెదకగా వెదకగా రెడ్‌లైట్ ఏరియాలో దొరికాడు. మరలా అదే డి అడిక్షన్ సెంటరుకు తీసికెళ్ళగా 'ఇతనికి మేమూ కాపలా కాయలేము" అని చేతులెత్తేశారు. పెరిగిన గడ్డం, చిరిగిన గుడ్డలతో... చూడగానే పిల్లలు దడచుకునేట్లున్న బాబూరావును ముందు మంగలిషాపుకు తీసుకెళ్ళి క్షౌరం చేయించి ఇంటికి తెచ్చాడు శంకరం. 'ఇదేమి ఖర్మరా నీకు" అంటూ శంకరం తల్లిదండ్రులు బాధపడ్డారు.

భవానీ అటు భర్తకు, ఇటు తమ్ముడికి ఏమి చెప్పలేక మధనపడటం ప్రారంభించింది. సరిగ్గా వంట చేయలేక పోతున్నది. పిల్లల్ని టైముకు స్కూలికి పంపడం, వచ్చాక వారి బాగోగులు చూడలేకపోతున్నది. అది చూచి అత్తమామలు కాస్త విసుక్కున్నారు. "ఇదేం కంపమ్మా! నీ తమ్ముడు సరిగ్గా వుంటే ఎంతైనా సహాయం చేయవచ్చు. నీకు, మీ ఆయనకూ... రాను రాను భవిష్యత్తులో ఇతని వల్ల ఎన్నో కష్టాలు వస్తాయి. నీ ఇష్టం, నీభర్త ఇష్టం" అన్నారు. శంకరం ఇవన్నీ గమనిస్తూనే ఉన్నాడు. కాని అతనికి కళ్ళ ముందు తన అత్తగారు "బాబూ! నాకు దిక్కెవరూ లేరు. అల్లుడివైనా కొడుకువైనా నీవే. మిగతా ఆడపిల్లలు, వాళ్ళ భర్తలు పట్టించుకోరు. నీవే నీ బావమరదిని అదుకోమంటూ" చేతులెత్తి నమస్కరించటం కళ్లముందు కదలాడుతూ వుండటం- అతణ్ణి కట్టిపడేస్తున్నది.

ఒకరోజు భార్యతో "భవానీ! నీవు నీ తమ్ముడు బాబూరావు గురించి దిగులు పడకు. మనకు ఉన్నంతలో అతణ్ణి సరిగ్గా చూడటానికి ప్రయత్నిద్దాం! నీ మనసులో సంకోచం ఉంచుకోక" అన్నాడు శంకరం. ఒకసారి బాబూరావుకు తీవ్ర జ్వరం. నెలపాటు దగ్గు, ఆకలి లేకపోవటం. దగ్గర్లో ఒక డాక్టరుకు చూపించారు. ఆయన అన్ని పరీక్షలు చేయించాడు. కొన్ని మందులు రాశాడు ఫలితం లేదు. మందులు నెల వాడినా జ్వరం తగ్గలేదు. పైగా వాంతులు ప్రారంభమయ్యాయి. డాక్టరు దగ్గర్లోని విసిసిటి సెంటర్‌కి పంపాడు. శంకరానికి తీసుకు వెళ్ళక తప్పదు. రిపోర్టులు వచ్చాయి. బాబూరావుకు నేటి మహమ్మారి రోగం ఆర్‌విడి (ఎయిడ్స్) అని చెప్పారు. కౌన్సిలింగు చేశారు. కళ్ళె వగైరా పరీక్షలు చేశారు. అసలు జబ్బుతోపాటు ఊపిరి తిత్తుల క్షయ అని తేల్చారు. శంకరానికి మతిపోయినంత పనైంది. భవానీకి నెమ్మదిగా అసలు విషయం చెప్పాడు. ఇప్పుడు బాబూరావుకు ఇంట్లో ఉంచుకోవటం క్షేమం అనిపించలేదు వారికి. పైగా ఇంట్లో చిన్నపిల్లలు ఇద్దరు, వృద్ధులు. ఇద్దరు మరల వచ్చి డాక్టర్‌ను సంప్రదించారు. ఆయన కూడా "అతను ఇంట్లో ఉండటం కన్నా ఆస్పత్రిలో ఉండటం మంచిది. ఇక్కడికి దగ్గర్లోనే వీళ్లకి ఒక ఆదరణ, సంరక్షణ కేంద్రం ఉంది. అక్కడ చేర్పించండి" అంటూ సలహా ఇచ్చాడు. ఆ అడ్రసు తీసుకొన్నాడు శంకరం.

అదో ఆదరణ, సంరక్షణ కేంద్రం. దాదాపు పదిహేను మందికి పైగా రోగులున్నారు. బాబూరావును పరీక్షించి డాక్టరు అతనిని చేర్చుకుంటానని చెప్పాడు. కాని అతని వెంట ఒక మనిషి ఉండాలని, మూత్రం, వగైరాలు వెంట వున్న మనిషి పట్టిపోయాలని అయితే చికిత్స, భోజనం, వెంట వున్న మనిషికి భోజనం ఉచితమే

అని చెప్పారు. అయితే బాబూరావు వెంట ఎవరు ఉండాలన్నది సమస్య. అదే డాక్టరుకు చెప్పారు. ఆయన సానుభూతితో "ఇక్కడ తప్పని సరిగా రోగికి తోడు ఒకరు ఉండాలి. బంధువులు ఎవరూ లేరా? తల్లి లేక భార్య, ఇంకెవరైనా సరే. వారికి భోజనం ఉచితం" అన్నాడు. తప్పనిసరి కావటంతో శంకరం రెండు రోజులు ఉద్యోగానికి సెలవు పెట్టి బాబూరావుతో వుండి సపర్యలు చేశాడు. ఆ ఆదరణ, సంరక్షణలో కేంద్రంలో దాదాపు ఇరవై మంది రోగులున్నారు. వాంతులు, విరేచనాలు కొందరికి, దగ్గు, ఆయాసం, కొందరికి జ్వరం కొందరికి, ఊపిరితిత్తుల క్షయతో కొందరు చివరి క్షణాల్లో కొందరు బాధపడ్తున్నారు. తల్లో, తండ్రో, భార్య, తమ్ముడో, అక్కో, చెల్లో ఎవరో ఒకరు వారికి తోడుగా వున్నారు.

క్షణికానందం కోసం జీవితకాలపు రోగాన్ని తెచ్చుకొని తాము ఇబ్బంది పడుతూ, అయిన వాళ్ళని ఇబ్బంది పెడుతూ వున్నవాళ్లని చూసి శంకరం చలించిపోయాడు. తన బావమరిది బాబూరావు తక్కువేం తినలేదు. అందులో ఒకరు కొత్తగా పెళ్లయిన అమ్మాయి. జబ్బు రావటానికి నీవు కారణం అంటే నీవు కారణం అని ఆమె తరపు బంధువులు ఒకపూట పెద్ద యుద్ధం చేసుకున్నారు. వారిని ఆపటానికి సంరక్షణ, ఆదరణ కేంద్రం వారు సెక్యూరిటీని పిలిపించవలసి వచ్చింది. కొంచెం నెమ్మదించాక ఆమెను పంపుతామని ఆమె తల్లిని తప్ప అందర్నీ పంపివేసారు.

రెండు రోజుల తరువాత కబురు చేయగా వచ్చిన అత్తగార్ని బాబూరావు వద్ద వుంచాడు. శంకరం రోజుకొకసారి చూడటానికి వెళ్ళి ఏమైనా కావలసివస్తే ఇచ్చివచ్చేవాడు. ఒక రోజు సంరక్షణ కేంద్రానికి వెళ్లేసరికి ఏడుస్తున్న అత్తగారు కనిపించారు. బాబూరావు అక్కడి నుండి తప్పించుకు పోయాడు. అత్తగార్ని ఇంటి వద్ద వుంచి బాబూరావు కోసం గాలింపు మొదలెట్టాడు శంకరం. రెండు రోజుల తరువాత ఓ బారుషాపు ముందు పొర్లుతూ దొరికాడు. మరలా అతనిని ఆదరణ, సంరక్షణ కేంద్రానికి తెచ్చి డాక్టరు గార్ని బతిమిలాడి చేర్పించారు. రెండు నెలలు బాగానే వున్నాడు. కాని దగ్గు తగ్గటం లేదు. జ్వరం కూడ వస్తున్నదని చెప్పారు.

డాక్టరు గారు బాబూరావును ఛాతీ వ్యాధుల ఆస్పత్రికి పంపి సిడి4 పరీక్ష చేసి ఏఆర్‌టి, క్షయకు మందులు మార్చి ఇచ్చారు. బాబూరావు మానసికంగా కుంగిపోయాడు.

"జరిగిందేదో జరిగిపోయింది. నీవు బాగా మందులు వాడి సరిగ్గా ఆహారం తీసుకుంటే ఆరోగ్యంతో పుంజుకుంటావు. నీ సిడి4 కణాలు పెరుగుతాయి. ఎక్కువ కాలం జీవించవచ్చు. ధైర్యంగా వుండు" అని అందరూ చెప్పారు. కాని బాబూరావుకు ఆరోగ్యం నానాటికి క్షీణించసాగింది. రెండు నెలల తర్వాత కళ్ళె పరీక్షల్లో టి.బి. క్రిములు ఇంకా వున్నట్లు రిపోర్టు వచ్చింది. ఎందుకలా వచ్చిందో ఆరా తీయగా బాబూరావు మందులు సరిగా వేసుకోవటం లేదని, సిస్టర్లు యిచ్చిన మందుల్ని వాళ్లముందు నోట్లో వేసుకొని ఆ తరువాత ఊసేసే వాడని పక్క రోగి బంధువులు చెప్పారు. "ఇలా అయితే ఎలాగండీ"

'ఇదేమిటి, ఈ రోగంతో మరణించిన వారిని వద్దనే చట్టం లేదు కదా, కాటికాపరికన్నా మేం తక్కువన్నమాట! హతవిధీ ఏమి వైపరీత్యము? అలా కుదరదు" అన్నాడు డాక్టరు. "కాదు సార్! వాళ్లకు తెలియక అలా అంటున్నారు. మీకు అన్నీ తెలుసు కదా, మీరే విశాల హృదయంతో మమ్మల్ని అర్థం చేసుకోవాలి. దయచేసి మొదట ఇచ్చిన డెత్ సర్టిఫికెట్‌ను తిరిగి తీసుకొని మరొకటి వేరే విధంగా రాసివ్వమని" ప్రాధేయపడ్డారు. డాక్టరు తన ఆర్ ఎం ఓను సంప్రదించి మరో డెత్ సర్టిఫికెట్ ఇచ్చారు 'ఆర్‌విడి' అని.

అన్న డాక్టరు ప్రశ్నకు శంకరం బదులు చెప్పలేకపోయాడు.

"నీ కోసం ఇన్ని మందులు... ఇంత మంది వున్నా నువ్వు ఎందుకిలా చేస్తున్నావు?" శంకరం అడిగాడు. "బావగారూ! నాకు ఇక మందులు వేస్తు. నాకు బతకటం ఇష్టం లేదు. బతికినా నేనొక కాగితం పువ్వును. ఎవరికీ పనికిరాను. నాకు నేనుగా పనికిరాను. నా తప్పుడు పనులకు నేను శిక్ష అనుభవించాలి. నా అలసత్వానికి, నిర్లక్ష్యానికి, విచ్చల విడితనానికి నాకు శిక్ష పడింది. దానిని త్వరగా ముగించదలచుకున్నాను. ఇది నాకే కాదు ఇలాంటి వాళ్ళందరి కథ ఇదే. మీరు నాగురించి ఇంక శ్రమపడకండి. నా తల్లిని, అక్కను శ్రమ పెట్టకండి. మీలాంటి సద్గుణ సంపన్నులుండబట్టే ఇంకా సమాజం బ్రతికి ఉంది. ప్రజలకు అన్ని దురలవాట్లను అందుబాటులో వుంచుతూ పైకి హెచ్చరికలు చేసే ఈ వ్యవస్థ కుళ్ళు స్వభావాలకు మేం ప్రత్యక్ష రుజువులం. నా కోసం ఎంతో శ్రమ చేసిన మీకు ఈ ఆదరణ, సంరక్షణ కేంద్ర సిబ్బందికి నా ధన్యవాదాలు" అని చెప్పిన బాబూరావు ఒక వారం రోజుల్లోపే మృతి చెందాడు.

శంకరం, భవానీ ఏడ్చుకుంటూ ఆదరణ మరియు సంరక్షణ కేంద్రానికి వచ్చారు. అంత్యక్రియలు చేయాలి. వచ్చేవాళ్ళు ఎవరూ లేరు. మిగిలిన అక్కలూ రారు. డెత్ సర్టిఫికెట్టు తీసుకొని దగ్గర్లోని శ్మశానవాటికకు వెళ్ళారు. డెత్ సర్టిఫికెట్ చూశాక వాళ్ళు అక్కడ అంత్య క్రియలకు ఒప్పుకోలేదు. ఆ జబ్బు వున్న వాళ్ళకు అనుమతి లేదన్నారు. అక్కడి నుండి శంకరం నాలుగు, ఐదు శ్మశానవాటికలు తిరిగాడు. ఫలితం లేదు.

❖ ❖ ❖

ఎండలో బండిమీద కూర్చున్న శంకరాన్ని సెల్‌మోత పలకరించింది. భవానీ ఫోను. పరిస్థితి వివరించాడు. ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు ఇచ్చినా, చట్టాలు చేసినా ఈ రోగుల పట్ల ఆదరణ పెరగలేదు. ఏం చేద్దాం భవానీ" అడిగాడు శంకరం. తాను ఎక్కడున్నదీ తెలిపాడు. దానికి భవానీ "ఏవండీ! ఈ జబ్బుకు సంబంధించి పాస్టివ్ నెట్ వర్క్ సంస్థ వుంది. అందులో నా స్నేహితురాలు వింధ్య వుంది. ఆమె సలహా తీసుకుందాం" అంది. సరేనన్నాడు శంకరం.

భవానీ తన స్నేహితురాలు వింధ్యకు ఫోన్ చేసి పరిస్థితి వివరించింది. "అలా అవటానికి వీల్లేదు కదా. చనిపోయాక అందరూ సమానమే కదా. చావులో కూడా వివక్ష చూపే వాళ్ళున్నారా? భలే స్వతంత్ర భారత దేశం! నాకు తెలిసిన శ్మశన వాటికల్లో కనుక్కుంటాను" అంది వింధ్య. ఓ రెండు గంటల తరువాత వింధ్య ఫోను చేసి "సారీ! భవానీ! అందరూ అలాగే అంటున్నారు. అయితే ఒక పని చేద్దాం. డెత్ సర్టిఫికెట్టులో సహజంగానో లేక చిన్నపాటి జబ్బో చేసినందున మరణించినట్లు రాయిద్దాం" అంది. "నీవు కూడా మాతో వచ్చి డాక్టరుతో మాట్లాడతావా!" అన్నది భవానీ వింధ్యతో.

వింధ్య, భవానీ, శంకరాలు ఆదరణ మరియు సంరక్షణ కేంద్రం డాక్టరును కలిసి పరిస్థితి వివరించింది. మరో డెత్ సర్టిఫికెట్‌ను ఇవ్వమని అడిగారు. 'ఇదేమిటి, ఈ రోగంతో మరణించిన వారిని వద్దనే చట్టం లేదు కదా, కాటికాపరికన్నా మేం తక్కువన్నమాట! హతవిధీ ఏమి వైపరీత్యము? అలా కుదరదు" అన్నాడు డాక్టరు. "కాదు సార్! వాళ్లకు తెలియక అలా అంటున్నారు. మీకు అన్నీ తెలుసు కదా, మీరే విశాల హృదయంతో మమ్మల్ని అర్థం చేసుకోవాలి. దయచేసి మొదట ఇచ్చిన డెత్ సర్టిఫికెట్‌ను తిరిగి తీసుకొని మరొకటి వేరే విధంగా రాసివ్వమని" ప్రాధేయపడ్డారు. డాక్టరు తన ఆర్ ఎం ఓను సంప్రదించి మరో డెత్ సర్టిఫికెట్ ఇచ్చారు 'ఆర్‌విడి' అని.

క్షణం అలస్యం చేయకుండా, దానిని, బాబూరావు మృతదేహాన్ని తీసుకొని దగ్గర్లోని శ్మశాన వాటికకు వెళ్ళి దహనం చేశారు- వింధ్య, శంకరం, భవానీ, బాబూరావు తల్లి.

"ఘనంగా ఎక్కడో పుట్టినోడు ఇక్కడ దిక్కులేని చావు చచ్చాడు" అంటూ బాబూరావు తల్లి ఏడ్చింది. "ఇంకా నయం హెచ్ఐవి/ఎయిడ్స్ తెచ్చుకున్న వాడి మీద ఇంకా సానుభూతి ఏమిటమ్మా? బాబూరావు బతికుండి కూడా సాధించటమే కాక చచ్చీ నన్ను బాగానే సాధించాడు. శోకాలు పెట్టకండి" శంకరం అత్తగార్ని, భవానీని సముదాయించాడు. జబ్బుల్లో ఇంత అంటరాని జబ్బు ఇంకేదీ లేదనుకున్నాడు. "బతికినప్పుడు అందరూ చీదరించుకొని దూరంగా ఉంచారు. చచ్చాకకూడా ఎంత వివక్ష? మనిషికన్నా శవం గొప్పదా? ప్రమాదకరమైనదా?" ఏమైనా సర్వం అగ్ని చేత ప్రక్షాళన అవుతుంది. అందుకు సంతోషం.

మనుషులు కొందరు ఇతరుల కోసం బతుకుతారు. మరి కొందరేమో ఇతరుల్ని బాధిస్తూ బతుకుతారు. బాబూరావు లాంటి వాళ్ళు ఎందరో ఈనాడు ఎంతో మందిని బాధపెడుతున్నారు. వాళ్ల తల్లులో, చెల్లెళ్లో లేక భార్యలో... ముఖ్యంగా ఆడవాళ్ళు బాధపడుతున్నారు. ఇలా రకరకాల ఆలోచనల్తో ఇంటికి చేరాడు శంకరం.

"స్నానాలు చేశారా? ఆ బట్టల్ని తగలబెట్టండి సుమా!" అన్నారు శంకరం తల్లిదండ్రులు కోపంగా ముగ్గురితో.

"ఏం లేదు నాన్నా! మేం చేత్తో అతణ్ణి ముట్టుకోలేదు" అన్నాడు శంకరం. "కంటికి కనపడకుండా ఉండే సూక్ష్మ జీవుల్ని ఎలా లేవనుకుంటావ్? పోతే పోనీ ఓ జత బట్టలేగా" అన్నాడు శంకరం తల్లిదండ్రులు. శంకరానికి వాటిని తగల బెట్టటం ససేమిరా ఇష్టం లేదు. కాని తప్పలేదు. ముగ్గురూ ఆ విడిచిన బట్టల్ని అగ్నికి ఆహుతి చేశారు.

❊

కాకర్లమూడి విజయ్

కొత్త మరుగుజ్జు జాతి

"తవ్వకాలలో లభించిన అస్థిపంజరం ఒక స్త్రీదని నిర్ధారించారు. ఆమె ఎత్తు 3.3 అడుగులు. బరువు 25 కిలోలు, వయసు 30 అని అంచనా వేశారు. ఇదే స్థలంలో ఇంతకు ముందు మరుగుజ్జు ఏనుగులు, రాకాసి ఎలుకలు, కొమోడో డ్రాగన్లు, రాతి పనిముట్లు కూడా లభించాయి."

విజ్ఞానం అనునిత్యం సరికొత్త విషయాల్ని వెలుగులోకి తెస్తుంటుంది. అలుపెరగని అన్వేషకులు, వారి ఫలవంతమైన మేధ, నిశిత పరిశీలన, విశ్లేషణ, వివరణ, సమన్వయం అందుకు కారణం. అది అంతులేని అంతరిక్షమే కావచ్చు, అర్థంకాని అగాధమే కావచ్చు. కానీ ఏదో ఒక రకంగా ఈ భూమ్మీద మన స్థానాన్ని మరింత మెరుగ్గా ఆకళింపు చేసుకోవడానికి విజ్ఞాన పరిశోధన తోడ్పడుతూనే వుంది. మన జ్ఞానాన్ని మరింత ముందుకు తీసుకుపోతూనే వుంది.

ఇటీవలే ఒక చిన్న ద్వీపంలో మరుగుజ్జు ఏనుగులు, భారీ ఎలుకల మధ్య మరుగుజ్జు మానవులు కూడా జీవించేవారని పరిశోధనలు వెలుగులోకి తెచ్చాయి. మనలోనూ మరుగుజ్జులు సాధారణమే అయినా పరిశోధనలో తేలిన విషయం...అటువంటి మరుగుజ్జులు ఒక ప్రత్యేక జాతిలా వుండే వారని!

ఆస్ట్రేలియా, ఇండొనేషియాకు చెందిన పరిశోధక బృందం బాలి సమీపంలోని ఫ్లోరిస్ ద్వీపంలో ఈ కొత్త జాతి మానవుల శిలాజాలు కనుగొన్నారు. ఇప్పటి మూడు సంవత్సరాల వయసు పిల్లాడి అంత ఎత్తు మాత్రమే పెరిగే ఈ జాతి మనుషుల పుర్రె ఓ చిన్న సైజు దబ్బపండులా వుంది. ఈ జాతి సుమారు 18000 సంవత్సరాల కింద జీవించి వుండేదని తెలుస్తోంది. ఈ జాతి కొత్తగా కనుగొనబడింది కాబట్టి దీనికి హోమో ఫ్లోరిసియెన్సిస్ అని పేరూ పెట్టేశారు. కానీ దీనిని సరదాగా 'హోబ్బిట్' మనిషి అని పిలుచుకుంటున్నారు (జనాదరణ పొందిన 'లార్డ్ ఆఫ్ ద రింగ్స్' కథల్లోని పొట్టి జీవాలు హోబ్బిట్లు).

ఈ తవ్వకాలలో లభించిన అస్థిపంజరం ఒక స్త్రీదని నిర్ధారించారు. ఆమె ఎత్తు 3.3 అడుగులు. బరువు 25 కిలోలు, వయసు 30 అని అంచనా వేశారు. ఇదే స్థలంలో ఇంతకు ముందు మరుగుజ్జు ఏనుగులు, రాకాసి ఎలుకలు, కొమోడో డ్రాగన్లు, రాతి పనిముట్లు కూడా లభించాయి. వీటిలో కొమోడో డ్రాగన్లు (పది అడుగుల పొడవు పెరిగే బల్లులు) ఇంకా జీవించే వున్నాయి!

ఈ హోబ్బిట్లు నిప్పుతో వంటలు చేసేవారనీ, 'స్టీగోడాన్' అనే మరుగుజ్జు ఏనుగుని వేటాడేవారనీ తెలుస్తుంది. చేపలు, కప్పలు, పాములు, తాబేళ్లు, పక్షులను కూడా వీళ్లు తినేవారు. ఏటొచ్చీ వీళ్ల మెదడు మాత్రం మన మెదడులో మూడోవంతు మాత్రమే వుండేదని అంటున్నారు. మనకంటే కాస్త పొడవైన చేతులూ, దట్టమైన కనుబొమలూ వున్నా గడ్డం మాత్రం లేదు.

విశేషమేమిటంటే ఈ జాతి జీవించి వున్నపుడు ఆధునిక మానవుడు హోమో సెపియన్స్ కూడా జీవించే వుండడం. నిజానికి వీళ్లిద్దరూ దాదాపు 30000 సంవత్సరాలు ఒకేసారి జీవించారని అంచనా! అయితే ఈ రెండు జాతులూ పరస్పరం కలిశాయా అన్నది సందేహమే.

హోమో ఫ్లోరిసియెన్సిస్ అస్థిపంజరం లభించినప్పుడు పరిశోధకులు ఆశ్చర్యపోయారు. దాన్ని ఒక చిన్న పిల్లల అస్థిపంజరం అనుకున్నారు. ఎందుకంటే ఇంతవరకూ అంత చిన్న ప్రౌఢ మానవ అస్థిపంజరం లభించలేదు. పైగా ఇప్పుడు జీవించి వున్న మరుగుజ్జు జాతి మానవులు 4.5 నుంచి 5 అడుగుల ఎత్తు పెరుగుతారు. హోబ్బిట్లు అంత తక్కువ ఎత్తు మాత్రమే ఎందుకున్నారు అనే దానిపై చర్చ జరుగుతోంది.

ప్రపంచవ్యాప్తంగా ద్వీపాలపై నివసించే జీవులు క్రమక్రమంగా తక్కువ పరిమాణంలోకి పరిణమించడం సాధారణమైనదే అంటున్నారు. ద్వీపాలలో పరిమిత ఆహారం, తక్కువ శత్రువులు, తక్కువ పోటీ, తక్కువ జీవులు వుంటాయి. అందువల్ల అవి తమ దేహాలను ఎంత చిన్నగా వుంచుకుంటే అంత లాభదాయకం. బహుశా ఇదే పరిణామ సూత్రంపై హోబ్బిట్లు ఉద్భవించి వుండవచ్చు. ఇది ఒక అంచనా మాత్రమే కానీ ఇదే కచ్చితం కాకపోవచ్చు.

ఈ ద్వీపంపై 8,40,000 సంవత్సరాల నాటి రాతి పనిముట్లు దొరికాయి కానీ 'పెద్ద' సైజు మనుషుల అవశేషాలు ఏవీ లభించలేదు. కాబట్టి అసలు పొట్టి జాతి మనుషులే ఈ ద్వీపం పైకి వచ్చారని ❋

పులి తోలు

శిష్యుడు: గురూజీ! పులి తోలు మీద కూర్చొని ధ్యానం చేస్తే ఏమౌతుంది?

యోగా మాస్టారు: అటవీశాఖ అధికారులు అరెస్టు చేస్తారు.

అదృష్టవంతుడు

రామారావ్: నీకు గుండె నొప్పి రాగానే పెద్దబ్బాయి వకీలును, చిన్నబ్బాయి డాక్టరును పిలుచుకొని వచ్చారు... అదృష్టవంతుడివి.

కృష్ణారావ్: మా చిన్నబ్బాయి డాక్టరును పిలుచుకొని వచ్చింది నా గుండె నొప్పికి వైద్యం చేయించడానికి కాదు... నా కిడ్నీ అమ్మడానికి.

ఓ.పి.ఆర్.

పక్కనే...

రాజ: రాణీ! నిన్ను చూడకుండా ఒక్క రోజూ కూడా ఉండలేను నువ్వు



ఎప్పుడూ నా పక్కనే ఉండాలి.

రాణి: బాధపడకు రాజూ! మరో వారం రోజుల్లో నేను మీ పక్కింటాయనను పెళ్ళి చేసుకోబోతున్నాను. ఇక ఎప్పటికీ మీ పక్కనే ఉంటాను. సరేనా!

ఫెయిర్ అండ్ లవ్‌లీ

రాము: అన్నయ్యా! కాకులు ఎందుకు నల్లగా వున్నాయి?

శ్యాము: ఎందుకంటే అవి ఫెయిర్ అండ్ లవ్‌లీ పెట్టవుగా!

లేడీస్ టైలర్

సతీష్: ఏంటీ కొత్త ఫ్యాషనా! గుండీలకు బదులు ఉక్కులు పెట్టించుకున్నావ్!

శ్రీకాంత్: ఫ్యాషనా తొక్కా! పొరపాటున లేడీస్ టైలర్‌తో నా షర్ట్ కుట్టించుకున్నానంతే. షర్టులన్నింటికి బటన్స్ బదులు ఉక్కులు కుట్టాడు!

ఎందుకు?

జడ్జి: ఏవయ్యా! చేసిన ఇంట్లోనే పది సార్లు దొంగతనం చేశావెందుకు?

దొంగ: ఏం చేయమంటారు సార్! ఇంటి ముందు 'విజిట్ ఎగైన్' అని రాసుంది.

ఎప్పుడూ ఏడుపే

డింగిరి: తాతయ్యా! లెక్కల పుస్తకం ఎప్పుడూ ఏడుస్తుంటుంది ఎందుకని?

తాతయ్య: లావుగా వుంటాననా?

డింగిరి: కాదుగా.

తాతయ్య: మరి ఎందుకో!

డింగిరి: ఏం చెయ్యమంటావ్ తాతయ్యా! పుస్తకం నిండా సమస్యలే కదా.

కె.పద్మ, ఒమ్మెవరం, ప్రకాశం.





ఆడపిల్లగా వాటా వస్తుందా!

మా నాన్నగారికి నలుగురు పిల్లలం. నేను పెద్దమ్మాయిని, మిగిలిన ముగ్గురు తమ్ముళ్ళు. అందరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. అందరికీ పిల్లలున్నారు. **2007** మేలో మా అమ్మగారు చనిపోయారు. నా వివాహం తర్వాత **1975**లో పసుపు కుంకుమ కింద రెండెకరాల భూమి ఇచ్చారు. మా అమ్మ చనిపోయే నాటికి ఆమె వద్ద లక్షరూపాయల విలువగల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వాటిని మా నాన్నగారు, భద్రపరచారు. మా నాన్నగారికి **40** లక్షల విలువగల ఇల్లు, **35** లక్షల విలువగల మూడున్నర ఎకరాల పొలం ఉంది. ఇది స్వార్జితమే. ఆయన వయస్సు **92** సంవత్సరాలు. బంగారం, ఇల్లు, పొలం నా తమ్ముళ్లకు ఇవ్వాలని ఆయన ఆలోచన. సంప్రదాయం ననుసరించి మా అమ్మ బంగారం నాకు రావాలనీ, ఆస్తిలో కూడా భాగం ఉంటుందని అంటున్నారు. సంప్రదాయం, చట్టం రీత్యా నాకు మా నాన్నగారి ఆస్తిలో వాటా, బంగారం వస్తాయా? మా నాన్నగారి ఆస్తి స్వార్జితం. నా విషయానికి వచ్చేటప్పటికి, మా అన్నాతమ్ముళ్ళంతా ఒక్కటే. నా హక్కును గూర్చి తగు సలహా ఇవ్వగలరు.

ఓ సోదరి, గుంటూరు.

మీకు ఈ పాటికే రెండెకరాలు ఇచ్చారన్నారు. మీ అమ్మగారి బంగారం సంప్రదాయ ప్రకారం మీ తమ్ముళ్లను ఒప్పించి పొందవచ్చు. కాని వారు ఇవ్వనప్పడు, అది మీ నాన్న గారి వద్ద ఉన్నప్పుడు, ఆస్తి అంతా నాన్నగారి స్వార్జితమైనప్పడు మీకు రావడం కష్టమే. కావున దాంట్లో తన ఇష్టం వచ్చినట్లుగా ఇవ్వవచ్చు. ఆయన స్వార్జితంలో సమాన వాటాలు కూడా అడగడానికి వీలులేదు. ఆయన ఇష్ట ప్రకారమే చెల్లుతుంది. ❋

పేరు కొద్దిగా తేడా వున్నా చెక్కు చెల్లదా!

నేను ఎపిఎస్ఆర్‌టిసి గ్యారేజీలో ప్రయివేటు కాంట్రాక్టరుగా పని చేశాను. పొన్నూరు డిపో ఎత్తివేశారు. నాకు పిఎఫ్ (ప్రావిడెంట్ డబ్బులు) **5000/-** రూపాయలకు చెక్కు ఇచ్చారు. చెక్కు నా కొడుకు షేక్ ఆసిఫ్ భాష పేర ఉంది. మా అబ్బాయికి **25** సంవత్సరాలు. పొన్నూరు ఆంధ్రాబ్యాంక్ ఎకౌంటు బుక్‌లో షేక్ ఆసిఫ్ బాషా పేరు ఉంది. ఆఫీసు రికార్డు పరంగా షేక్ ఆసిఫ్ అనే పేరు పెట్టారు. ఆంధ్రాబ్యాంక్‌లో చెక్కు మార్చుకోవదానికి వెళితే.... చెక్కు మీద షేక్ ఆసిఫ్ అని వున్నది. పుస్తకం మీద షేక్ ఆసిఫ్ బాషా వుంది. బాషా పేరు మార్చి తీసుకొనిరమ్మన్నారు. పొరపాటుగా బాషా రాయించలేదు. గుంటూరు ఎసి ఎకౌంటు ఆఫీసర్ గార్ని కలిశాను. ఈ మధ్యలో ఆరు నెలల గడిచింది. చెక్కు చెల్లదన్నారు. నేను అప్లికేషన్ పెట్టాను. కొత్త చెక్కు ఇస్తామన్నారు. బాపట్ల డిపో మేనేజర్ గార్కి గుంటూరు ఏసి గారు కొత్త చెక్కు ఇవ్వవలసిందిగా చెప్పారు. బాపట్ల డిపో మేనేజర్ రేపురా, మాపురా అని తిప్పుతున్నారు. నేను ఆరు మాసాల నుండి తిరుగుతున్నాను. సలహా ఇవ్వగలరు.

ఎస్.కె. అన్వర్, పొన్నూరు.

ఎటువంటి చెక్కు అయినా ఆరు నెలలు గడువు మాత్రమే ఉంటుంది. ఆ గడువు తీరే లోపు మళ్లీ చెక్కు ఇచ్చిన అధికారి వద్ద రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికైనా ఇంకో చెక్ ఇస్తానన్నారు. కావున అది ఎలాగైనా తీసుకోండి. బ్యాంకు యాజమాన్యాన్ని అడిగి 'అప్పడు పేరు అలా రాయించడం జరిగింది. కాని ఆసిఫ్ అన్నా ఆసిఫ్ బాషా అన్నా ఒక్కరే' అని అఫిడవిట్ తీసుకోండి. నోటరీ రాయించండి. లేదా ఇద్దరూ ఒక్కరే అన్నట్టు ఎంఆర్‌ఓ ఆఫీసులో రిపోర్టు తీసుకోండి. బ్యాంకు వారిని సంప్రదించండి. వారి సలహా మేరకు ఏదైనా ఒకటే చేయండి. ❋

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహా రావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.మా చిరునామా:

ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం,
స్ట్రీట్ నెంబర్: 1,
అశోక్ నగర్,
హైదరాబాద్ - 500 020



జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది, 9848994240

బటర్ చాక్‌లెట్స్

కావలసిన పదార్థాలు

చాక్‌లెట్ పౌడర్- అర కప్పు, పంచదార- ఒక కప్పు జీడిపప్పు- రెండు స్పూన్లు, బాదం పప్పు (కట్ చేసినవి)- రెండు స్పూన్లు, వెన్న - కప్పు, పాలు- ఒక కప్పు,

తయారు చేసే విధానం

ఒక మందపాటి గిన్నె తీసుకొని పాలు, వెన్న, పంచదార బాగా కలిపి స్టౌ మీద పెట్టి సన్నటి సెగపై వుడికించాలి. చిక్కగా దగ్గరగా అయ్యాక దించి వెన్న రాసిన పళ్ళెంలో పోసి సమంగా సర్దాలి. తరువాత చాక్‌లెట్ పౌడర్‌ను కరిగించి ఇందాకటి మిశ్రమంపై పోసి, జీడి పప్పు, బాదం పప్పు ముక్కలను పైన అలంకరించి చల్లారనివ్వాలి. తరువాత కావలసిన సైజులో ముక్కలు కట్ చేసుకోవాలి. వీటిని ఫ్రిజ్‌లో పెట్టుకొని కూల్‌గా తింటే చాలా బావుంటాయి.



పుచ్చకాయతో ఐస్ క్రీమ్

కావలసిన పదార్థాలు

పుచ్చకాయ - ఒకటి (కొంచెం పెద్దది), పంచదార - రెండు కప్పులు పాలు - నాలుగు కప్పులు, క్రీమ్ - ఒక కప్పు, కస్టర్డ్ పౌడర్ - ఒక స్పూన్ ఎసెన్స్ - అర స్పూన్

తయారు చేసే విధానం

పుచ్చకాయను కడిగి పై పొట్టు తీసి ముక్కలు కోసుకోవాలి. గింజలు కూడా తీసేయాలి. ముక్కలను మిక్సీ చేసి వుంచుకోవాలి. పాలను బాగా మరిగించాలి. కొంచెం చల్లటి పాలు తీసుకొని అందులో కస్టర్డ్ పౌడర్ కలిపి మరుగుతున్న పాలల్లో పోసి బాగా కలపాలి. పంచదార కూడా వేసి బాగా కలపాలి. బాగా దగ్గరగా అయ్యాక దించి ఇందులో ఇందాకటి పుచ్చకాయ మిశ్రమాన్ని, క్రీమ్, ఎసెన్స్ వేసి మిక్సీలో గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత ఆ మిశ్రమాన్ని ట్రేలో పోసి ఫ్రిజర్‌లో పెట్టాలి. గట్టిపడిన తరువాత తీసి మరొకసారి గ్రైండ్ చేసి ఫ్రిజ్‌లో పెట్టాలి. రెండు గంటల తర్వాత తీసి ఐస్‌క్రీమ్ కప్స్‌లో పెట్టి అందరికీ అందివ్వవచ్చు.

రుచి

\- పి.జ్యోతి

డ్రై ఫ్రూట్స్ షేక్

కావలసిన పదార్థాలు

డ్రై ఫ్రూట్స్ - ఒకకప్పు, పంచదార- పావు కప్పు
పాలు- రెండు కప్పులు, ఎసెన్స్- అర స్పూన్,
జీడి పప్పు- ఒక స్పూన్
బాదం పప్పు- ఒక స్పూన్

తయారు చేసే విధానం

కప్పు పాలను బాగా కాచాలి, జీడిపప్పు, బాదం పప్పులు, నీరు పోసి మిక్సీలో వేసి, పేస్ట్‌లా చేయాలి. పాలల్లో వేసి కొంచెం నీరు పోసి మరికాస్త మరిగించి దించుకోవాలి. చల్లారాక దీనిలో పంచదార వేసి గ్రైండ్ చేయాలి. బాగా నురగ వచ్చేలా చేయాలి. డ్రైఫ్రూట్స్‌ని చిన్నగా కట్ చేసి కొన్ని పౌడర్ చేసి ఇందాకటి పాలల్లో కలపాలి. మిగితావి పైన వేసి ఫ్రిజ్‌లో పెట్టాలి. ఎసెన్స్ కలపాలి. చల్లబడ్డాక తాగితే రుచిగా వుంటుంది. పిల్లలకు ఎండాకాలం అందిస్తే, బలం... ఆరోగ్యం. ఎంతో ఇష్టంగా తాగుతారు కూడా.



కస్టర్డ్ స్వీట్

కావలసిన పదార్థాలు

సేమియా- కప్పు, పాలు - నాలుగు కప్పులు, పంచదార- నాలుగు కప్పులు, అరటి పండు ముక్కలు - ఒక కప్పు, యాపిల్ ముక్కలు- అర కప్పు, చెర్రీ ఫ్రూట్స్ - పావు కప్పు దానిమ్మ గింజలు - అర కప్పు, జీడిపప్పు ముక్కలు- పావు కప్పు

తయారు చేసే విధానం

ముందుగా పాలను గిన్నెలో పోసి బాగా మరిగించాలి. సేమియాను ఉడికించి తీసి జల్లిపళ్లెంలో వేసి నీరు తీసేసి దానిపై చల్లటి నీరు పోస్తే అతుక్కోకుండా వుంటుంది. కస్టర్డ్ పౌడర్‌ను చల్లటి పాలల్లో కలిపి అప్పుడు మరుగుతున్న పాలల్లో వేసి కలపాలి. ఆ తరువాత పంచదార కలపాలి. ఉడికించిన సేమియా వేసి కొద్దిసేపు వుంచి దించేయాలి. చల్లారిన తరువాత పైన చెప్పిన పండ్ల ముక్కలను వేసి, జీడిపప్పులను వేసి బాగా కలిపి ఫ్రిజ్‌లో పెట్టాలి. కూల్ అయిన తరువాత చల్ల చల్లగా తింటే చాలా రుచిగా వుంటుంది.



ENTERED

కథా నిలయం
శ్రీకాకుళం

అర్ధవంతమైన కథలు



జీవితం ఒక చమత్కారమైన అద్భుతం- ఒక అందమైన అబద్ధం కూడా! జీవితం ఒక తనివి తీరని మోహం - ఒక వినసొంపైన గీతం కూడా! అది ఒక ఆత్మీయానురాగాల, ఉరకలేసే ఉత్సాహాల హేల.... అనురాగాల వల....

98 పేజీల్లో ముచ్చటైన 10 కథలు.

కథల్లో సరసమైన నడకలున్నాయి.... చమత్కారికమైన నడవడికలున్నాయి. ప్రాంతీయతా పరిమళాలతో పాటు మాండలికాల కొసగాలులున్నాయి. సృజనాత్మకత అడుగడుగునా పలకరిస్తుంది.

అప్పుడే మాండలికం తిరుపతి ప్రాంతం కొండ గాలిలా పలకరించిపోతే సంభాషణా చతురత వసంత రాగంతో తట్టిపోతుంది. కథల మూలాలు వేరు. కొన్ని జలపాతాల్లా హోరున దూకుతాయి. కాసిని కన్నీళ్ళు... కాసిన్ని చిరునవ్వులు కలబోస్తేనే జీవితం అంటారు. జీవితం ఎన్నో సంఘటనల సమాహారం. రాళ్ళల్లోనూ గుండె చప్పుళ్ళు విన్పించే నిజాల్లాంటి కథలు. సామాజిక ప్రయోజనానికి అక్షరాలనెక్కడ, ఎలా, సంధించాలో తెలిసిన రచయిత రామచంద్ర రాజుగారు.

ఆత్మీయంగా పలకరించి అంతే ఆత్మీయంగా సుఖదుఃఖాలు పంచుకునే కలం ఆయన చేతుల్లో బుద్ధిగా భావనలు రాసింది. పుంఖానుపుంఖాలుగా కథలొచ్చి పడుతున్న ఈ రోజుల్లో మాత్రం 'నాగమణి ఎందుకు నవ్వింది' - సొంతం చదివితే కాని అర్థం కాదు. అర్థవంతమైన కథలు...! కథలను ఇష్టపడే వాళ్ళు చదవాల్సిన కథలు. చదవండి! నాగుమణిని పలకరించండి.

నాగుమణి నవ్వింది (కథా సంపుటి)
రచన: డి రామచంద్ర రాజు, పేజీలు: 98,
వెల: పేర్కొనలేదు,
ప్రతులకు: శ్రీమతి డి. సుజాత, 466-25, మిద్దె మీద, రిజర్వాయర్ కాలనీ, తిరుపతి.

డా॥ జె.పి. వైద్య

ప్రేరణ

ఈలే
వెల:75-,
పేజీలు:183
ప్రతులకు:
ఈలే
కేరాఫ్: రవికుమార్
హౌజ్ నెం. 3-53,
కుప్పానగర్, మెదక్.

నాలో

(కవితా సంపుటి)
రచయిత: మనాశ్రీ

వెల:32/-,
పేజీలు: 39
ప్రతులకు:
ప్రజాశక్తి బుక్‌హౌస్,
విశాలాంధ్ర,
అన్ని బ్రాంచీలు,
మణికంఠ
బుక్‌స్టాల్.

ప్రపంచ రాజకీయాలు



వై.వి. కృష్ణారావు
'రైతుమిత్ర'
ప్రచురణలు
వెల:30/-,
పేజీలు: 99
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు, చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్, కొండాపూర్

కళాకారులు-కళాభిమానుల డైరీ

కడప జిల్లాలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన నటులు, కళాకారుల చిరునామాలు, పరిచయాలతో ఒకచోటకు చేర్చేప్రయత్నం "కడపజిల్లా రంగస్థల కళారత్నాలు" ద్వారా జరిగిందని చెప్పవచ్చు. సమాజంలో మార్పులు అన్ని రంగాల్లోనూ జరుగుతున్నాయి. ఫలితంగా సాంస్కృతిక రంగంలో కూడా ఆ ప్రభావం కనపడుతోంది. దీనివల్ల రంగస్థలం మాయమయ్యే దశకు చేరుకొంది. ఈ నేపథ్యంలో జిల్లాలో జానపద కళాకారులు, రంగస్థల, కళాకారులు, కవులు, రచయితలు, బుడ బుక్కల కళాకారులు, తోలు బొమ్మలాట కళా కారులు, వాయిద్య, ఖవ్వాలి, మిమిక్రి ఇలా ఒకటేమిటి మేకప్, డ్రామా డ్రస్ కంపెనీలు, గాయనీగాయకులు, సంగీతం, సాహిత్య నాటక సంస్థల సమాచార వేదికగా నిలిచింది ఈ పుస్తకం. ప్రముఖ రచయితలు, నాటక రంగ ప్రముఖుల పరిచయాలతో పాటు కడప జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాల విశేషాలు వివిధ మతాలకు చెందిన ప్రదేశాల ప్రాశస్త్యాలు వివరించారు. ఒక రకంగా కళాకారుల్ని, ప్రముఖ స్థలాల్ని జిల్లా ప్రజలకు పరిచయం చేయడమే. ఈ మహత్తర కార్యక్రమాన్ని చేయడంలో విజయం సాధించిన వై.ఎస్.సిలార్, పుస్తక ప్రచురణకు సహకరించిన కె.రాజరత్నం ఐజాక్‌లు అభినందనీయులు.



- ఎస్. మస్తాన్ వలి

For the Completion of National Democratic Revolution in India

Price :20/-
Pages: 126
Copies
P. Ahalya Devi
Sanghamitra Publication
Sanghamitra, 32-13-53/7A
. Journalist Colony,
Vijayawada.





చేస్తుండగానే చవులూరెనులే...



విదేశాల్లో ఎద్దు మాంసానికి ఎంత గిరాకీ వుందో తెలీనిదేముంది! ఉరుగ్వే దేశస్థులూ అందుకు మినహాయింపు కారు. ఇటీవల అక్కడ 1252 మంది నలభీములు కలిసి 12 మెట్రిక్ టన్నుల ఎద్దు మాంసాన్ని బొగ్గుల మీద కాల్చి మరీ వడ్డించారు. ఈ తతంగాన్నంతా వీక్షించిన 20,000 మంది ... లొట్టలేసుకుంటూ రుచి చూశారు. 1500 మీటర్ల పొడవున బొగ్గులు పోసి వెలిగించి...చేసిన ఈ వేపుడు కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ అధికారులు దగ్గరుండి మరీ పర్యవేక్షించారు. నిర్వాహకులను అభినందనలతో ముంచెత్తడమే కాకుండా అప్పటికప్పడే సర్టిఫికెట్ ఇచ్చేశారు. ఈ భారీ వేపుడు కార్యక్రమంలో పాల్గొన్న ఒక వంటగాడు ఏమన్నాడంటే... "ప్రపంచం మొత్తం మీద ఇంత పెద్ద ఎత్తున ఎద్దు మాంసాన్ని వేయించిన ఘనత మాకే దక్కుతుంది. అందుకు చాలా సంతోషంగా వుంది".



ENTERED

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్టకార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : పి. మౌనికశ్రీ
చదువు: 8వ తరగతి
వయసు: 12 సం॥
స్కూలు: సెవెన్త్‌డే అడ్వంటిస్ట్ హైస్కూల్, ఇబ్రహీం పట్నం
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం
చిరునామా : పి. మౌనికశ్రీ, డాటరాఫ్: రామకృష్ణ నాయుడు, నంది కొట్కూరు, కర్నూలు.

పేరు : బొగ్గుల భావనారెడ్డి
చదువు: 10వ తరగతి
వయసు: 15 సం॥
స్కూలు : రవీంద్రనాథ్ ఠాగూర్ విద్యాలయం
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పేపర్ చదవడం, పాటలు వినటం, నీతి కథలు చదవడం
చిరునామా : బి. భావనారెడ్డి, డాటరాఫ్:బి. వెంకట్రామిరెడ్డి, సాయినగర్, వైరా, ఖమ్మం.

పేరు : జె. శ్రీకాంత్
చదువు: 9వ తరగతి
వయసు: 14సం॥
స్కూలు : జడ్.పి.హెచ్.ఎస్.
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : టీవీ చూడడం, క్రికెట్ ఆడడం.
చిరునామా : జె శ్రీకాంత్, సన్నాఫ్: బాలయ్య, ఖానాపూర్, మహబూబ్‌నగర్.

పేరు : కసుకుర్తి రాజేష్
చదువు: 7వ తరగతి
వయసు: 12సం॥
స్కూలు : బి.వి. సుబ్బయ్య హైస్కూల్, పేర్నమిట్ట
లక్ష్యం: ఎస్.ఐ. కావడం
హాబీలు: క్రికెట్ ఆడటం, కథల పుస్తకాలు చదవడం, డ్రాయింగ్ వేయటం, డాన్స్ చేయటం
చిరునామా : కె. రాజేష్, సన్నాఫ్: రవికుమార్, ఒంగోలు, ప్రకాశం.

పేరు : ఎన్. ధరంసింగ్ నాయక్
చదువు: 10వ తరగతి
వయసు: 15 సం॥
స్కూలు : ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలుర), ఖానాపూర్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు : చదవడం, పాటలు పాడడం, టీవీ చూడడం, క్రికెట్, వాలీబాల్ ఆడడం
చిరునామా : ఎన్. ధరంసింగ్ నాయక్, సన్నాఫ్: రాంచందర్, ఇం.నెం. 7-24, లింగాపూర్, మామడ, ఆదిలాబాద్.

పేరు : ఎస్. జయసత్య జిత్త
చదువు: 7వ తరగతి
వయసు: 11సం॥
స్కూలు : మదర్ థెరిస్సా ఇంగ్లీష్ మీడియం స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : బొమ్మలు తయారు చేయడం
చిరునామా : ఎస్. జయసత్య జిత్త, సన్నాఫ్: ఎన్. శ్రీనివాసరావు, విజయవాడ.